
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ నేత. పాలన బాగుందని ప్రజలు మెచ్చుకుంటున్నారు. పింఛన్ పెంపు, తల్లికివందనం నిధులు, రోడ్లు, ధాన్యం బకాయిలు తీర్చడం, ఉచిత బస్సు ప్రయాణం వంటివి సంక్షేమ పాలనకు నిదర్శనం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 18.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 126 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# దీపావళికి డబుల్ బోనస్



- జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలకు కేంద్రం కసరత్తు
- ఈ దీపావళికి ప్రజలకు డబుల్ బోనస్ అందిస్తామన్న ప్రధాని
- వస్తు, సేవల ధరలు తగ్గించి సామాన్యులకు మేలు చేయడమే లక్ష్యం
- ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో రెండు శ్లాబుల విధానం

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఈ ఏడాది దీపావళికి దేశప్రజలకు డబుల్ బోనస్ అందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. వస్తు, సేవల ధరలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేందుకు జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ఆదివారం ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

సుపరిపాలన విస్తరణే తమకు సంస్కరణ అని పేర్కొన్న ప్రధాని, ప్రజల జీవితాలను, వ్యాపారాలను సులభతరం చేసేందుకు రానున్న రోజుల్లో మరిన్ని సంస్కరణలు రానున్నాయని తెలిపారు. "ఈ ప్రయత్నంలో భాగంగా జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు రాబోతున్నాయి. ఈ దీపావళికి జీఎస్టీ సంస్కరణల రూపంలో పౌరులకు డబుల్ బోనస్ లభిస్తుంది" అని మోదీ అన్నారు.

ఈ సంస్కరణలకు సంబంధించిన పూర్తి ఫ్రేమ్‌వర్క్‌ను అన్ని రాష్ట్రాలకు పంపించామని, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి అన్ని రాష్ట్రాలు సహకరించాలని ప్రధాని కోరారు. మరోవైపు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పటికే జీఎస్టీ కౌన్సిల్‌కు కీలక ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం ఉన్న 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం అనే నాలుగు శ్లాబుల స్థానంలో... కేవలం 5 శాతం, 18 శాతం అనే రెండు శ్లాబులను మాత్రమే అమలు చేయాలని ప్రతిపాదించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఈ కొత్త విధానంలో సామాన్యులు వినియోగించే నిత్యావసరాలు, ఆరోగ్య సంబంధిత వస్తువులు, హస్తకళలు, ఇన్సూరెన్స్ వంటి వాటిపై 5 శాతం పన్ను ఉంటుంది. ఫ్రిజ్, టీవీ వంటి ఇతర తయారీ వస్తువులపై 18 శాతం పన్ను విధిస్తారు. మిగతా 2లో...

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్డీయే తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఇవాళ ఢిల్లీలో సమావేశమైన భాజపా పార్లమెంటరీ పార్టీ బోర్డు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారు చేసినట్టు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు భాజపా తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు భాజపా సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీ.

## పార్టీలపై ఈసీకి వివక్ష లేదు




**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సంఘానికిఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అ-నవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు.


"బిహార్‌లో ఎస్ఐఆర్ పై కొన్ని పార్టీలు, సంబంధిత నేతలు అసత్య ప్రచారం చేయడం తీవ్ర ఆందోళనకరం. ఎన్నికల సంఘం భుజాల పైనుంచి కొన్ని రాజకీయ పార్టీలు దాడులు చేస్తున్నాయి. మిగతా 2లో...

## అప్రమత్తంగా ఉండాలి



**శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో విస్తరంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వైద్య,రెవెన్యూ,పోలీసుశాఖలతో విద్యుత్తు ఇతర ముఖ్య శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రధానంగా వాతావరణ పరిస్థితులు అననుకూలం గా ఉన్నందున సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం, అవసరమున్న చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే తప్ప ప్రజలకు బయటకు రాకుండా ఉండాలని కోరారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం పిడుగులు పడే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచామని, అత్యవసరమైన వారు సంప్రదించాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సమాచారం అడిగి తెలుసుకుంటున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

## హస్తినకు మంత్రి లోకేష్




- పెండింగ్ ప్రాజెక్టులపై రేపు కేంద్ర మంత్రులతో లోకేష్ భేటీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. మంత్రి లోకేష్ సోమవారం ఈమేరకు పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు కేంద్రమంత్రులతో భేటీ అయిన లోకేష్ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టుల రాకతోపాటు వేగవంతంగా అనుమతులు మంజూరవుతున్నాయి. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు దీటుగా ఆంధ్రప్రదేశ్ ను నిలిపేందుకు లోకేష్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రేపటి పర్యటనలో రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్ కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు చెబుతారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర రోడ్డురవాణా, రహదార్ల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తో మంత్రి లోకేష్ సమావేశమవుతారు.

## అమరావతిలో గాజు వంతెన

### ఐకానిక్ టవర్లతో అనుసంధానం



**అమరావతి , (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతిలో నిర్మితమవుతున్న సచివాలయ టవర్లకు సంబంధించిన డీటెయిల్డ్ డిజైన్లు కొలిక్కి వస్తున్నాయి. లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ రూపొందిస్తున్న నమూనాలు తుది దశకు చేరుకున్నాయి. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ సముదాయంలో వేర్వేరుగా నిర్మిస్తున్న ఐదు టవర్లను వంతెనతో ఒకదానితో ఒకటి అనుసంధానించనున్నారు. ఉక్కుతో నిర్మించే డయాగ్రిడ్ ఆకృతులను అమరావతిలోనే బిగించనున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. మిగతా 2లో...

## ఉపాధి పనుల్లో అక్రమాలకు..

## 'ఏఐ'తో చెక్ !



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తప్పుడు మస్టర్ల తో మాయ, బినామీ, బోగస్ కూలీలతో దోపిడీ, పని చేయకుండా చేసినట్లు బిల్లులు, కొలతల్లో వ్యత్యాసాలు పలు అక్రమాలకు పాల్పడుతూ ఉపాధి హామీ పథకంలో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. ఈ అక్రమాలకు ప్రభుత్వం ఏఐతో చెక్ పెడుతోంది. హాజరు నుంచి పని కొలతల వరకు ఎక్కడా అక్రమాలు జరగకుండా కట్టుదిట్టం చేస్తోంది.

నిర్దేశిత పనికి, చేసిన పనికి తేడాలు: ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై సామాజిక తనిఖీల్లో అత్యధికంగా అవకతవకలు కొలతల్లోనే జరిగినట్లు తేలింది. ఒక క్షేత్ర సహాయకుడు చేసిన పనికి ఇద్దరు ముగ్గురు క్షేత్ర సహాయకులు బిల్లులు పెట్టుకోవడం, నిర్దేశిత పనికి, చేసిన పనికి భారీగా తేడాలు ఉండడం, గతేడాది చేసిన పనికి ఇప్పుడు బిల్లులు చేసుకోవడం ఇలా కొలతల మాయతో రూ.కోట్లను దోచేశారు. తాజాగా జీ.కొండూరు, మిగతా 2లో...

## మాజీ సైనికులకు వ్యవసాయ డ్రోన్‌లు


- రూ.10 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ సైనికులు దేశానికి ఆస్తి అని, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ తెలిపారు. ఇందులో భాగంగానే రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏపీ మాజీ సైనికుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయబోతోందని చెప్పారు. మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం 'దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకం ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా వ్యవసాయ డ్రోన్లను సైనిక సంక్షేమ శాఖ, కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ కొలాబరేషన్‌లో మాజీ సైనికులకు సరఫరా చేయనున్నారు. మిగతా 2లో...

## తిరుమలకు వెళ్లే భక్తులకు అలర్ట్

- వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి




**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీవారి దర్శనానికి తిరుమలకు వెళ్లే వాహనాలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేసింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వివిధ వాహనాల్లో చేరుకునే భక్తులకు మెరుగైన భద్రత, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించే లక్ష్యంతో ఈ నెల 15వ తేదీ నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి చేసింది. మిగతా 2లో...

## ఖండాంతరాలకు సిక్కోలు ఖ్యాతి



**సిక్కోలు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రాంతానికో ప్రత్యేకత, ఊరికో వైవిధ్యం, ప్రతి దాని వెనకా ఓ సుదీర్ఘ చరిత్ర ఉంది. అలాంటివెన్నో వస్తువులు సిక్కోలు ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చాయి. తరతరాల నుంచి అదే ధోరణిని కొనసాగిస్తున్నారు. ఎంతో మంది ప్రముఖుల మెచ్చుకోలు దక్కించుకున్నాయి. జిల్లా కీర్తిని నలుదిశలా ఇనుమడింపజేస్తున్నాయి. వజ్రోత్సవాల వేళ సిక్కోలు ప్రత్యేకతలపై నేటి ప్రత్యేక కథనం.

పొందూరు ఖాదీ - తిరుగులేని ఖ్యాతి: పొందూరు అనగానే మదిలో మెదిలేది ఖాదీ వస్త్రాలే. జిల్లా పేరును దేశ, విదేశాలకు తీసుకెళ్లాయి. వీటికి ఇంత ఖ్యాతిని తెచ్చిపెట్టినవి కొండ పత్తితో దారం తీసే ప్రక్రియ, వస్త్రాల తయారీలో చేపముల్లు వినియోగమే అని చెప్పవచ్చు. 1921లో మహాత్మాగాంధీకి ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యం గురించి తెలిసింది. దీనికి ముగ్ధుడైన బాపూజీ కుమారుడు దేవదాస్ గాంధీని పంపారు. గాంధీజీ దీనిపై 'యంగ్ ఇండియా' పత్రికలో ఓ కథనం ప్రచురించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఢిల్లీ ఎగ్జిబిషన్ మైదానంలోని హస్తకళా ప్రదర్శనలో ఈ వస్త్రాలను చూసి ఆశ్చర్యపోయారట. 1955లో ఆచార్య వినోభా బావే శంకుస్థాపన చేసిన పొందూరు ఖాదీ చేనేత సంఘ భవనమే నేడు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మిక అభివృద్ధి సంఘంగా పనిచేస్తోంది.

పలాస జీడిపప్పు - ప్రత్యేక గుర్తింపు: పలాస ప్రాంతంలో లభించే జీడిపప్పునకు దేశ, విదేశాల్లో ప్రసిద్ధి చెందింది. జిల్లా అంతటా 350 పరిశ్రమల ద్వారా రోజుకు 80 టన్నుల వరకు ఉత్పత్తి జరుగుతోంది. దీని రుచి, నాణ్యత కారణంగా ఇది అంతటి ఖ్యాతిని సంపాదించింది. ఇక్కడ తయారైన జీడిపప్పు ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. దేశంలో కొత్తగా పలు రాష్ట్రాల్లో జీడి కర్మాగారాలున్నా పలాస సరకుకు మాత్రం నేటికి క్రేజ్ తగ్గలేదు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలోనూ ఈ జీడిపప్పునే వాడుతున్నారు.

మందస కోవా - రుచి వహ్వా: పాలకోవా అన్ని ప్రాంతాల్లో దొరుకుతుంది. మిగతా 2లో...

## విశాఖ ఐటీకి పూర్వకళ



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్):** వైఎస్సార్సీపీ పాలనలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలకు ఎగనామం పెట్టారు. ఫలితంగా కొన్ని కంపెనీలు విశాఖపట్నంను విడిచి వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే కొత్త ఐటీ పాలసీ విధానాన్ని తీసుకువచ్చింది. భారీగా సబ్సిడీలను ప్రకటించి సాగర తీరానికి ఐటీ కంపెనీలకు ఆహ్వానం పలికింది.

కొన్ని దిగ్గజ కంపెనీలు ముందుకు వచ్చి విశాఖలో కార్యకలాపాలు సాగించడానికి ఒప్పందాలు చేసుకున్నాయి. మరికొన్ని కంపెనీలు వరుసలో ఉన్నాయి. అందుకు అవసరమైన భూ కేటాయింపులు చేస్తూ ఇటీవలనే మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

భూ కేటాయింపులు జరిగిన కంపెనీలు 12 నెలల్లోపు తమ కార్యకలాపాలను కొనసాగించడంతో పాటు, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం యువతకు ఉపాధి కల్పించేలా మిగతా 2లో...

# దీపావళికి డబుల్ బోనస్

(మొదటి పేజీ తరువాయి)

అయితే, సిగరెట్లు, పొగాకు, చక్కెర పానీయాలు, పాన్ మసాలా వంటి లగ్జరీ, హానికర వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధానం యథాతథంగా కొనసాగుతుంది.

ఈ ప్రతిపాదనపై చర్చించి ఆమోదం తెలిపేందుకు జీఎస్టీ కౌన్సిల్ సెప్టెంబరులో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా దేశంలో వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు ప్రతి ఇంటికీ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేస్తాయని, అలాగే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు.

# పార్టీలపై ఈసీకి వివక్ష లేదు

(మొదటి పేజీ తరువాయి)

బిహార్ ఓటరు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచిస్తున్నాం. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

"డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం కానీ, ఓటరు భయపడే ప్రసక్తే లేదు. కోటి మందికిపై ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇంత పారదర్శకంగా చేపట్టిన కార్యక్రమంలో 'ఓటు చోరీ' ఎలా సాధ్యమవుతుంది..? ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటరు పేరు తొలగించం. ప్రతిఒక్క ఓటరుకు ఈసీ దన్నుగా నిలుస్తుంది." అని సీఈసీ స్పష్టం చేశారు.

**ఇప్పటికి 10కిపైగా ఎస్ఐఆర్‌లు..:** "సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవం. ప్రతి ఎన్నికల ముందు ఓటరు జాబితాను సరిచేయడం ఎన్నికల సంఘం విధి. ఓటరు జాబితాలను సవరించేందుకు దేశంలో ఇప్పటివరకు 10 సార్లకుపైగా సవరణలను చేపట్టాం. పశ్చిమ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్ణీత సమయంలో ప్రకటిస్తాం. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నా" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ వెల్లడించారు.

**ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదం: కాంగ్రెస్ :** తమకు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలనే తేడా ఉండదని ఎన్నికల సంఘం చెప్పడాన్ని కాంగ్రెస్ హాస్యాస్పదంగా పేర్కొంది. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఏ ప్రశ్నకూ సీఈసీ అర్థవంతంగా సమాధానం ఇవ్వలేకపోయారని విమర్శించింది. ఈసీ సొంత డేటా ద్వారా వెల్లడైన వాస్తవాలను మాత్రమే రాహుల్ ప్రస్తావించారని గుర్తుచేసింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఈసీ అక్షరాలా అమలు చేస్తుందా? అని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈసీ వైఖరి దాని అసమర్థతను మాత్రమే కాకుండా, పక్షపాతాన్ని కూడా పూర్తిగా తేటతెల్లం చేసిందని ఆరోపించారు.

# అమరావతిలో గాజు వంతెన

(మొదటి పేజీ తరువాయి)

టవర్లను మొత్తం 68 లక్షల 88 వేల 64 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. జీఏడీ టవర్‌ని బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే సీఎం కార్యాలయం రానుంది. దీని టెర్రస్‌పై హెలిప్యాడ్‌ను నిర్మిస్తారు. మిగిలిన నాలుగు హెచ్‌వోడీ టవర్లు 39 అంతస్తులతో నిర్మించనున్నారు.

మూడో అంతస్తులో గాజు వంతెన: ఒక టవర్ నుంచి మరో టవర్‌లోకి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సందర్శకులు సులువుగా వెళ్లేందుకు వీలుగా వంతెనను నిర్మిస్తారు. దీనిని ఆకర్షణీయంగా గ్లాస్‌తో 900 మీటర్ల పొడవుతో రూపొందించనున్నారు. ఇది మూడో అంతస్తులో రానుంది. ఇందులో శీతలీకరణ యంత్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. టవర్లకు అనుబంధంగా ఎనిమిది ఎమినిటీస్ బ్లాకులు ఒక్కొక్కటి గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా మూడు అంతస్తులతో నిర్మిస్తారు.

వీటిల్లో సమావేశ మందిరాలు, డిస్పెన్సరీలు, క్రెచ్‌లు, క్యాంటీన్‌లు, గ్రంథాలయాలు, తదితర వసతులు ఉంటాయి. ఎత్తైన ఈ భవనాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎదుర్కొనేందుకు వీలుగా భారీ అగ్నిమాపక శకటాలతో ప్రత్యేక ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం వివిధ దేశాల్లోని నమూనాలను ఇప్పటికే పరిశీలించారు. ప్రతి టవర్ వద్ద 50 మీటర్లు పొడవు, వెడల్పుతో పెద్ద పోర్టికోలు కూడా నిర్మిస్తారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నీటిలోనే ఉన్న టవర్ల వద్ద నేల సామర్థ్యాన్ని గుత్తేదారు సంస్థలు పరీక్షించాయి. 1000 టన్నుల బరువును వేసి పరీక్షించగా సానుకూల ఫలితాలు వచ్చాయి.

డయాగ్రిడ్ ఆకృతుల ఫ్యాబ్రికేషన్ ఇక్కడే: ఐకానిక్ టవర్ల ఆకృతులు డయాగ్రిడ్ విధానంలో రూపొందించారు. ప్రతి టవర్‌కు సగటున 15 నుంచి 20 వేల టన్నుల మేర ఉక్కును వినియోగించనున్నారు. ఇప్పటికే సీఆర్డీఏ అధికారులు పలు రాష్ట్రాల్లోని ఉక్కు కర్మాగారాలను సందర్శించారు. టవర్ల పనులను దక్కించుకున్న మూడు గుత్తేదారు సంస్థలు అమరావతిలోనే వర్క్‌షాపులను ఏర్పాటు చేసేందుకు సీఆర్డీఏ అధికారులను అనుమతి కోరారు. దీనికి 10 ఎకరాల స్థలం కేటాయించమని అడిగాయి. భారీ పరిమాణంలో డయాగ్రిడ్ ఆకృతులను ఇతర ప్రాంతాల్లో ఫ్యాబ్రికేట్ చేసి ఇక్కడకు తీసుకురావాలంటే సమయం వృథా కానుంది. ఇటువంటి సమస్యలేమీ లేకుండా సైట్‌లోనే యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రవాణా పరమైన ఇబ్బందులు తప్పుతాయని భావిస్తున్నారు.

# విశాఖ ఐటీకి పూర్వకళ



(మొదటి పేజీ తరువాయి)

అడుగులు పడుతున్నాయి.

కంపెనీ భూములు ఎక్కడంటే: విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ విస్తరణ కోసం ఐటీహిల్స్-3 వద్ద 22 ఎకరాల భూమిని కేటాయించారు. ఏఐ డేటా సెంటర్, క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుతుంది. తొలుత మధురవాడలో భూమిని అందించాలని నిర్ణయించారు. అదే విధంగా తర్లువాడలో గుర్తించిన మరో 200 ఎకరాల్లో 80 ఎకరాల మేర భూ కేటాయింపులు అధికారులు చేయనున్నారు. మధురవాడలో 22.19 ఎకరాలను కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపులు చేశారు.

ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ ఆఫీస్ స్పేస్‌తో పాటు డేటా సెంటర్ ఏర్పాటుకు, కాపులుప్పాడ వద్ద 56.5 ఎకరాలు, మరోవైపు ఐటీ హిల్-3లో 3.5 ఎకరాలు స్థలాన్ని కేటాయించారు. ఐటీ హిల్స్‌లో ఫీనమ్ పీపుల్ సంస్థకు 4.45 ఎకరాలు కేటాయించారు. హిల్ నంబర్ 3లో 2.5 ఎకరాలు, అదే విధంగా హిల్ నంబర్ 4లో 7.79 ఎకరాలు ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఇచ్చారు. ఐటీ హిల్-3పై 3.6 ఎకరాలు, సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు పరదేశిపాలెంలో 50 ఎకరాలు భూమిని కేటాయించారు.

ప్రస్తుతం 150 వరకు కంపెనీలు: మధురవాడలోని ఐటీ హిల్స్, నగరంలోని కలిపి వివిధ స్థాయిల ఐటీ కంపెనీలు 150 వరకు ఉన్నాయి. వీటిలో డబ్ల్యూఎన్ఎస్ (5వేల మంది), పాత్ర (3వేలు), టెక్‌మహీంద్ర (1500), కాండియంట్ (వెయ్యి), ఇన్ఫోసిస్ (వెయ్యి), ఫ్లూయింట్‌గ్రిడ్, మిరాకల్, ఏసీఎన్, మొదలైన కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు అన్నింటిలో సుమారు 30వేల మంది ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వం ఇన్నోవేషన్ వ్యాలీ స్టార్టప్ బిల్డింగ్ బోసిపోయేలా చేసింది. ప్రస్తుతం కొన్ని స్టార్టప్ కంపెనీలతో ఈ భవనం తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది.

# అడవిలో ఏనుగుల కోసం అండర్‌పాస్

**అమరావతి , (జర్నలిస్ట్ ఫైల్):** వన్యప్రాణులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన ఘటనలు ఎక్కడో ఒకచోట తరచూ జరుగుతూనే ఉన్నాయి. అభయారణ్యాలు జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో అయితే ఈ సమస్య ఎక్కువగా ఉందని అటవీ అధికారులు తెలుపుతున్నారు. ఇకపై మూగ జీవాలు రోడ్డు ప్రమాదాల్లో గాయాల పాలవ్వకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఆ దిశగా చర్యలు కూడా చేపడుతున్నారు.



**ఏనుగులు సంచరించడానికి వీలుగా 12 అండర్‌పాస్‌లు :** వన్యప్రాణులకు ఎలాంటి అడ్డంకి లేకుండా సంచరించేందుకు ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ప్రత్యేక మార్గాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం చెన్నై-బెంగళూరు 258 కి.మీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి రూ. 17,930 కోట్లతో పనులు చేపట్టారు. ఈ హైవే జిల్లాలో చిత్తూరు పలమనేరు అడవి మార్గం గుండా వెళ్తుంది. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 65 కి.మీ దూరం పనులు జరుగుతున్నాయి. ఈ మార్గం అడవి గుండా సాగుతుంది. ఇక్కడ ఏనుగుల సంచారం ఉండటంతో వాటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్మాణాన్ని చేపట్టాలని ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ఆలోచించారు. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఈ మార్గంలో ఏనుగులు సంచరించడానికి వీలుగా 12 అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. ఎత్తైన పిల్లర్లు నిర్మించి దానిమీద రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు.

వందకుపైగా గజరాజుల సంచారం : అలాగే తిరుపతి జిల్లాలోని కాలూరు నుంచి పీలేరు వరకు ఎన్‌హెచ్-71ను భాకరాపేట రక్షిత అడవిలో నిర్మించాల్సి ఉంది. కనుమదారిలో మొత్తం 11 కి.మీ. ఉండగా నిర్మాణంలో భాగంగా ఏనుగులు, ఇతర వన్యప్రాణుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నాలుగుచోట్ల 15 అడుగుల ఎత్తులో అండర్‌పాస్‌లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. తిరుపతి జిల్లా పరిధిలో 30, చిత్తూరు పరిధిలో వందకుపైగా గజరాజులు సంచరిస్తుండటంతో అభివృద్ధి పనుల్లో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు.

**గతంలో జరిగిన ఘటనలు:** రహదారిపై ఏనుగుల గుంపు : కొన్ని నెలలుగా మన్యం జిల్లా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ గ్రామంలోకి వెళ్లి ఏనుగులు దాడులు చేస్తాయోనని వణికిపోతున్నారు. ఇటీవల జియ్యమ్మవలస మండలం సుభద్రమ్మ వలస సమీపంలో ఏనుగుల గుంపు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి వాహనాలపై దాడి చేశాయి. పార్వతీపురం నుంచి కురుపాం వరకు చింతపండు లోడుతో వెళ్తున్న ఓ లారీని అడ్డగించిన ఏనుగులు వాటి అద్దాలను ధ్వంసం చేశాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ అక్కడినుంచి పరుగులు తీశారు. తరచూ ఏనుగుల రోడ్లపై సంచరించడం వల్ల ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై పులి సంచారం : గతంలో అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని దారకొండ అటవీ ప్రాంతంలోని పెద్దపులి సంచరిస్తోందని గిరిజనులు తెలిపారు. డొంకరాయి నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెళ్తున్న క్రమంలో దారకొండ ఘాట్ రోడ్డుపై పెద్దపులి సంచరిస్తుండగా కొంతమంది వీడియో తీయగా, ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దారకొండ ఘాటి రాదారిలోని సప్పర్ల రెయిన్ గేజ్ వద్ద పులి కనబడినట్లు గిరిజనులు పేర్కొన్నారు.

# విద్యుత్‌శాఖలో ఉద్యోగాల భర్తీ

**అమరావతి , (జర్నలిస్ట్ ఫైల్):** నిరుద్యోగుల జీవితాల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యుత్ సంస్థల్లో దశాబ్ద కాలం తర్వాత ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న 9,849 పోస్టుల్లో 75 శాతం భర్తీ చేయనుంది.



విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దశాబ్ద కాలం తర్వాత విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాల నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. టెక్నికల్ కేడర్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, సివిల్, ఎలక్ట్రికల్, టెలికాం, ఐటీ, జూనియర్ ఇంజినీర్లు, నాన్-టెక్నికల్ కేడర్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) కేటగిరీలో జూనియర్ లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీల్లో 75 శాతం పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్వల్పసంఖ్యలో ఖాళీలు భర్తీచేసింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పోస్టుల భర్తీని పూర్తిగా నిలిపేసింది. పదోన్నతులు, పదవీ విరమణలతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయి. వివిధ కేడర్లలో 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యను ఉద్యోగసంఘాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ నియామకాలకు అనుమతించింది. డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల అవసరాల మేరకు వెంటనే భర్తీ చేయాల్సిన కేడర్ పోస్టులను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. టెక్నికల్ విభాగంలో 1,982 ఖాళీలున్నాయి. నాన్-టెక్నికల్ విభాగంలో 1,875 పోస్టులు, ఓ అండ్ ఎంలో 5,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మూడు కేటగిరీల్లో 24,489 పోస్టులు మంజూరు కాగా 9,849పోస్టులు ఖాళీలున్నాయి. సిబ్బందికి పదోన్నతుల వల్ల కేడర్ మారినా సీటు మారట్లేదు. కిందిస్థాయిలో ఏఈఈ, ఏఈ పోస్టుల భర్తీ దశాబ్దకాలంగా నిలిచిపోవడంతో నిబంధనల మేరకు సిబ్బందికి పదోన్నతులు కల్పించినా అక్కడే కొనసాగించాల్సి వస్తోంది. రెండు పోస్టుల విధులతో వారిపై పని ఒత్తిడి పెరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా వేగంగా పునరుద్ధరించలేకపోతున్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో ఎలాగోలా నెట్టుకొస్తున్నా, డిస్కంలో సమస్య ఎక్కువగా ఉంది. దీంతో నియామకాలు చేపట్టక తప్పదని అధికారులు గుర్తించారు.

గత ఐదేళ్లలో వీటీపీఎస్, కృష్ణపట్నంలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున రెండు కొత్త ప్రాజెక్టులు ఉత్పత్తిలోకి వచ్చాయి. వాటి అవసరాల మేరకు నియామకాలు చేపట్టకుండా, ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరతవల్ల, థర్మల్ ప్లాంట్లలోసాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వెంటనే సరిదిద్దడానికి ఇబ్బందిగా మారింది. ఫలితంగా సంస్థలో అంతర్గత శిక్షణ, బయటి ప్రాంతాలకు శిక్షణ కోసం పంపే ప్రక్రియ నిలిచింది. ఈ పరిస్థితిలో మార్పుతెచ్చి విద్యుత్ సంస్థలకు పునరుజ్జీవం పోసేందుకే నియామకాలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

# మాజీ సైనికులకు వ్యవసాయ డ్రోన్‌లు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు నిర్దేశించిన ఈ పథకం కింద తీసుకునే డ్రోన్లతో ఉపాధి పొందడమే కాకుండా సమాజ సేవ చేయాలని విశ్వజీత్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకుడు బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్మీ నుంచి తిరిగొచ్చాక ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకుండా ఇలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

దక్ష అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ నుంచి వ్యవసాయ డ్రోన్లు : సైనికులుగా దేశానికి సేవలందించిన వారు ఇప్పుడు మాజీ సైనికులుగా పల్లె సేవకు సిద్ధమవుతున్నారు. పదవీ విరమణ చేసి వచ్చిన మాజీ సైనికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కోసం సైనిక సంక్షేమ శాఖ, కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'దేశ సేవ నుంచి పల్లె సేవకు' పథకానికి శ్రీకారం చుట్టారు. ఔత్సాహికులైన మాజీ సైనికులకు ఈ పథకం కింద దక్ష అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ నుంచి వ్యవసాయ డ్రోన్లను అందజేస్తారు. రూ. 11లక్షల విలువైన ఈ డ్రోన్‌ను మొదట రూ. 1.50 లక్షలు కట్టి పొందొచ్చు. మిగిలిన మొత్తాన్ని ఎలా చెల్లించాలి, రాయితీ వివరాలను అగ్రిమెంట్‌లో పొందుపరుస్తారు. ఏడాది గ్యారెంటీ ఇస్తారు. డ్రోన్‌తోపాటు వచ్చే బ్యాటరీ సెట్‌తోపాటు మరో అయిదు సెట్లను అందజేస్తారు. ఈ డ్రోన్‌తో రోజుకు 30 ఎకరాల విస్తీర్ణంలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయవచ్చు.

శిక్షణ : చిన్న, మధ్య తరహా వ్యవసాయ డ్రోన్‌ల నిర్వహణ కోసం పైలట్ శిక్షణను దక్ష అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ ఇవ్వనుంది. డ్రోన్ తీసుకున్న మాజీ సైనికుడికి మాత్రమే శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ కోసం ఒక్కొక్కరికీ అవసరమయ్యే రూ. 80వేలను సైనిక సంక్షేమ శాఖ భరిస్తుంది. హైదరాబాద్/చెన్నైలో ఈ శిక్షణ ఉంటుంది. 10 రోజుల శిక్షణ అనంతరం వ్యవసాయ డ్రోన్ పైలట్‌గా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ధ్రువీకరణ పత్రాన్నీ ఇస్తారు. అప్పుడు వారు లీగల్ డ్రోన్ పైలట్ అవుతారు. వారి పేరు, లైసెన్స్ వివరాలను డీజీసీఏ వద్ద నమోదు చేస్తారు. ఈ పైలట్ లైసెన్స్ ఉంటే తర్వాత నిఘా డ్రోన్‌లను ఆపరేట్ చేసే అర్హత కూడా వచ్చే అవకాశం ఉంటుంది. మాజీ సైనికులకు పురుగు మందులు పిచికారీ చేసే పనిని కూడా కోరమాండల్ కంపెనీ ఇస్తుంది. ఇందుకోసం ఎకరాకు రూ. 400 నుంచి రూ. 500 వరకు ఇస్తారు.

# తిరుమలకు వెళ్లే భక్తులకు అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించమని వాహనదారుల సౌకర్యార్థం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని టీటీడీ ఏర్పాటు చేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఫాస్టాగ్ లేని వాహనాలు స్థానికంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో ఫాస్టాగ్ సౌకర్యం పొందిన తర్వాతే తిరుమలకు అనుమతించనున్నట్లు టీటీడీ తెలియజేసింది.

తిరుమల సేవలో ప్రముఖులు: బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఇరువురూ వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులు అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్?లు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వీరికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వారికి శ్రీవారి చిత్రపటాలను బహుకరించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం: తిరుమలలో శ్రీవారిని మంగళవారం దాదాపు 77,596 మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి సర్వ దర్శనానికి దాదాపు 25 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం పట్టింది. తిరుమలలో దేవస్థానంలో శ్రీవారికి దాదాపుగా మొత్తం 31,565 మంది భక్తుల వరకూ తలనీలాలు సమర్పించారు. తిరుమలలో నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.73 కోట్ల వరకూ వచ్చింది.

తిరుమల శ్రీవారికి బంగారు కానుక: తిరుమల శ్రీవారికి బెంగుళూరుకు చెందిన శ్రీనివాసమూర్తి రూ. 25 లక్షలు విలువైన బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో వెంకయ్యచౌదరికి దాత శ్రీనివాసమూర్తి ఈ బంగారు ఆభరణాన్ని అందజేశారు. వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందించినట్లు సమాచారం.

# ఖండాంతరాలకు సిక్కోలు ఖ్యాతి

(మొదటి పేజీ తరువాయి)

మందస పాలకోవా రుచికి మాత్రం ఏదీ సాటిరాదు. అందుకే ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. వనమూలికలకు నిలయమైన మహేంద్రగిరులపై పచ్చిక బయళ్లలో మేత మేసే గేదె పాలతో వీటిని తయారు చేస్తున్నారు. దీని రుచి, సుచి అద్భుతంగా ఉంటాయి. వీటిని కట్టెల పొయ్యిపైనే తయారు చేస్తారు. కప్పుల్లో వేసి క్రీం కోవాగా మార్కెట్ చేస్తారు. ముద్దగా చేసి బిళ్లలు కూడా అమ్ముతున్నారు.

వన్నె తగ్గని బుడితి పరిశ్రమ: వందేళ్ల చరిత్ర కలిగిన బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమ సొంతం. దీనిపై ఆధారపడి 60 వరకు కుటుంబాలు జీవిస్తున్నాయి. పూర్వకాలంలో బరువైన బిందెలు, దీపం కుందులు, కంచాలు, గ్లాసులు తయారు చేసేవారు. వాటికి డిమాండు తగ్గడంతో ప్రస్తుతం ఇళ్లలో అలంకరణ వస్తువులు పూలకుండీలు, దేవతామూర్తుల విగ్రహాలు తయారు చేస్తున్నారు. వాటిని ఆర్డర్లపై లేపాక్షికి వస్తువులు పంపుతారు. రాజమహేంద్రవరం, విశాఖ వంటి ప్రాంతాల నుంచి ముడి సరకు రప్పిస్తారు. దిల్లీ, ఆగ్రా, ముంబయి, కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాల్లోనూ ప్రత్యేక స్టాళ్లలో వీటిని విక్రయిస్తారు.

ఏడుకొండలపైకి ఇక్కడి బెల్లం: ఆమదాలవలస మండలం నిమ్మతొర్లువాడ గ్రామంలో తయారయ్యే బెల్లానికి గుర్తింపు ఉంది. ఇందుకు కారణం తయారీ విధానం, సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన చెరకు వాడకం. సేంద్రియ వ్యవసాయం కారణంగా చెరకు సహజంగానే బంగారు రంగులో ఉంటుంది. దాంతో ఏ విధమైన రసాయనాలు వాడకుండా చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల అవశేషాలతో పాటు తేమ లేకుండా ఉండటం, రంగూరుచీ బాగుండటంతో రెండున్నర సంవత్సరాలు నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం ఈ బెల్లాన్ని తీసుకుంటోంది. ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడు కాజాల తయారీలోనూ దీన్నే విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఒడిశా, బెంగాల్ వ్యాపారులు సైతం కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలకు.. 'ఏఐ'తో చెక్ !

(మొదటి పేజీ తరువాయి)

గంపలగూడెం మండలాల్లో గతేడాది జరిగిన అవకతవకల్లో దాదాపు రూ. 5 కోట్ల వరకు కొలతల తేడాల్లోనే జరిగాయి. ఈ తరహా మోసాలకు ఏఐతో అడ్డుకట్టు వేస్తున్నారు. ఇస్రో వారి భువన్ యాప్ ద్వారా ఏ రోజు చేయాల్సిన పని ఆ రోజే జీవో ఫెన్సింగ్ చేస్తారు. ఇది చేసిన తర్వాతే కొత్త పని చేసేందుకు అవకాశం ఉంటుంది. ముందు చేసిన పనికి బిల్లులు పెట్టుకనేందుకు అవకాశం ఉండదు. చేసిన పని మళ్లీ వచ్చే ఏడాది చేయడానికి వీలు ఉండదు. దీంతో తప్పుడు బిల్లుల వ్యవహారానికి కళ్లెం వేయడానికి అవకాశం ఉంటుంది.

తప్పుడు మస్తర్లకు అడ్డుకట్ట: ఇప్పటివరకు ఎన్ఎంఎంఎస్‌లో ఫొటోల అప్‌లోడ్ చేసే విధానం ఉంది. దీనిలో రోజూ పని చేసిన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. బినామీ, బోగస్ శ్రామికుల ఫొటోలు పెట్టినా గుర్తించే అవకాశం లేదు. పైగా ఒకసారి అప్‌లోడ్ చేసిన ఫొటో 15 రోజుల తర్వాత మళ్లీ ఈ యాప్‌లో కనిపించదు. దీంతో ఇదే అనువుగా అనుకొని అడ్డగోలుగా దోచేశారు. ఇకపై ముఖ గుర్తింపు హాజరుతో ఈ అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. శ్రామికుల ఫొటోలను జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ముందుగా అప్‌లోడ్ చేస్తారు.

పని ప్రదేశంలో 2 పూటలా శ్రామికుల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకరి తరఫున మరొకరు హాజరైతే యాప్ అనుమతించదు. ఉదయం ఫొటో దిగితే ఒక పూట వేతనం మాత్రమే వస్తుంది. ఈ హాజరును పంచాయతీ కార్యదర్శులు పరిశీలిస్తారు. ఆగస్టు 10వ తేదీ నుంచి కొత్త విధానం అమలులోకి వచ్చింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు మాస్టర్ ట్రైనీల ద్వారా ఉమ్మడి జిల్లాలో క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

## 'ఈసీ'పై చర్యలకు వీల్లేకుండా చట్టం తెచ్చారు



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** బిహార్‌లో ఓట్ల చోరీకి 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' ఓ మార్గమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘంపై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా 2023లో కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చిందని, ప్రధాని మోదీ- అమిత్ షాలకు ఈసీ సాయం చేస్తున్నందునే ఇలా చేసిందని ఆరోపించారు. ఓటర్ల జాబితా అవకతవకల విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలపై ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"ఈ రోజు ఎన్నికల సంఘం ఓ సమావేశం నిర్వహించింది. అయితే.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీ ఫుటేజీల విషయంలో ప్రభుత్వం చట్టాన్ని ఎందుకు మార్చింది? అదేవిధంగా.. ఎన్నికల కమిషనర్లపై ఎటువంటి కేసు నమోదు చేసేందుకు వీల్లేకుండా 2023లో చట్టం చేసింది. ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఈసీ సాయం చేయడంతోపాటు ఓట్ల చోరీలో పాలుపంచుకుంటున్నందుకు ఎవరూ చర్యలు తీసుకోకూడదనే దీన్ని రూపొందించింది" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' తొలిరోజు ముగింపు సభలో ప్రసంగిస్తూ.. రాజ్యాంగాన్ని, 'ఒక వ్యక్తి- ఒక ఓటు' సూత్రాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా వ్యవహారంలో ప్రతిపక్షాల ఆరోపణలను అంతకుముందు ఎన్నికల సంఘం ఖండించిన విషయం తెలిసిందే. ఈసీకి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తుందని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని, లేనిపక్షంలో వాటిని నిరాధారమైనవిగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

## విశాఖను ముంచెత్తిన వాన..

**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్):** సాగర నగరం విశాఖపట్నాన్ని ఆదివారం భారీ వంర్షం ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు నగరం అతలాకుతలమైంది. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విశాఖ నగరంలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, గాజువాక, పెద్ద గంట్యాడలో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ముఖ్యంగా గాజువాకలోని డైరీ కాలనీ, హెచ్‌బీ కాలనీ, రిక్షా కాలనీ వంటి ప్రాంతాల్లో ఇళ్లలోకి సుమారు మూడు అడుగుల మేర వరద నీరు చేరింది. మరోవైపు, జ్ఞానాపురం, చిలకపేట, వన్ టౌన్ ఏరియాల్లో వరద ఉద్ధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. హనుమంతవాక, తాడిచెట్ల పాలెం వంటి కొండ ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో జీవీఎంసీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారత వాతావరణ శాఖ మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు, ఉరుములు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించడంతో, కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అత్యవసర సహాయక చర్యల కోసం అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# హిమాచల్ వరదల్లో భారీ నష్టం

## 257 మందికిపైగా మృతి, మరో 200 మంది ఆచూకీ గల్లంతు



**సిమ్లా, ఆగస్టు 17 :** హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 257 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండ చరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 133 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల్లో 124 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. ఈ జిల్లాలో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 26 మంది మరణించారు. ఆ తర్వాత కాంగ్రాలో 28 మంది, చంబాలో 10 మంది, కులులో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక బిలాస్‌పూర్, కిన్నౌర్, సిమ్లా, సిర్మౌర్, సోలన్, లాహౌల్‌స్పితి, హమీర్‌పూర్, ఉనాలో కూడా మరణాలు సంభవిం చాయి. రోడ్డు ప్రమాదాల కారణంగా మండి (21), చంబా (20), సిమ్లా (15), కాంగ్రా (12), కిన్నౌర్‌లో 12 మరణాలు సంభవించాయి. ఇక ఇప్పటి వరకూ 331 మంది గాయపడ్డారు.

ఈ వర్షాలకు భారీగా ఆస్తి నష్టం కూడా సంభవించింది. రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి సరఫరా పథకాలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. రూ.లక్షలు విలువ చేసే పంటలు నీటిపాలయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలకు రోడ్లు కొట్టుకుపోవడం వంటి కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతీయ రహదారులు సహా 455 రోడ్లు బ్లాక్ అయ్యాయి. కులు జిల్లాలో 73 రోడ్లు మూసి వేశారు. ఆ తర్వాత మండిలో 58, సిమ్లాలో 58 రోడ్లను అధికారులు మూసివేశారు. విద్యుత్ సరఫరా కూడా పూర్తిగా దెబ్బతిన్నది. కులులో 145, సిమ్లాలో 63 సహా మొత్తం 681 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 182 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనవసరమైన ప్రయాణాలను నివారించాలని, వాతావరణ శాఖ అధికారుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### విక్రోలిలో విరిగిపడిన కొండచరియలు

#### ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**ముంబయి, ఆగస్టు 17 :** వాణిజ్య రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా నగరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విక్రోలి ప్రాంతంలో ఓ ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. విక్రోలిలోని జన్‌కల్యాణ్ సొసైటీలో శనివారం ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో ఓ కుటుంబం లోని నలుగురు సభ్యులు ఇంట్లోనే ఉన్నారు.

రోడ్లు, రైల్వే ట్రాక్‌లపైకి భారీగా వరద నీరు చేరడంతో నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబై, రాయ్‌గడ్ జిల్లాలకు అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ ఖిరెడ్ అలర్ట్‌ఖి జారీ చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ముంబై పోలీసులు హెచ్చరించారు. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయి, దారి సరిగా కనిపించని పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. అత్యవసర సహాయం కోసం



ఒక్కసారిగా ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో వారు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ఘటనలో షాలు మిశ్రా, సురేశ్‌చంద్ర మిశ్రా అక్కడికక్కడే మృతి చెందారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఆర్తి మిశ్రా, రితురాజ్ మిశ్రాలను రక్షించి రాజావాడి ఆసుపత్రికి తరలించాయి. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో ముంబైలోని గాంధీ నగర్, కింగ్స్ సర్కిల్ సహా అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

100, 112, 103 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

మరోవైపు, బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కూడా సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, అత్యవసర సాయం కోసం 1916 నంబరును సంప్రదించాలని కోరింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో శిథిలాలను పూర్తిగా తొలగించామని, ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించామని అధికారులు వెల్లడించారు.



## చషోటి వరద ప్రాంతాల్లో సిఎం ఓమర్ అబ్దుల్లా పర్యటన

**శ్రీనగర్, ఆగస్టు 17 :** జమ్ము కశ్మీరులోని కిష్త్‌వార్ జిల్లాలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 60 మందికిపైగా మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో గురువారం వచ్చిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొన సాగుతున్నాయి. తాజాగా చషోటి గ్రామాన్ని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు బాధిత కుటుంబాలకు జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఎక్స్‌గ్రే షియా ప్రకటించింది. విపత్తులో మరణించిన కుటుంబాలకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయప డినవారికి రూ.లక్షచొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రక టించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ. 50 వేలు అందించనున్నట్లు తెలిపింది. ఇక ఈ ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.50వేలు, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.25 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కిష్త్‌వార్ జిల్లాలో ఆకస్మిక కుంభవృష్టికి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా దాదాపు 65 మంది ప్రాణాలు కోల్పోయారు. 160 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. మరో 200 మంది వరకు గల్లంతయ్యారు. మారుమూల పర్వత ప్రాంతంలోని ఓ గ్రామంపై మేఘ విస్ఫోటం సంభవించి గ్రామాన్ని వరద ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు గాలిస్తున్నాయి. మచైల్ మాతాదేవి యాత్రకు వెళ్లే మార్గంలో వాహనాలు వెళ్లగల చివరి గ్రామం చషోటీని కుంభవృష్టి ముంచెత్తినట్లు అధికారులు చెప్పారు. హిమాలయ పర్వత శ్రేణుల్లో కొలువై ఉన్న చండీమాత ఆలయంలో జరుగుతున్న వార్షిక మచైల్ మాత యాత్రలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు చషోటీ గ్రామానికి చేరుకున్నపుడు ఈ ఘటన జరిగింది.

## 18న వాషింగ్టన్‌లో ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ



**అలాస్కా, ఆగస్టు 17 :** ఉక్రెయిన్ తో యుద్ధానికి ముగింపు పలకడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడువ్లాదిమిర్ పుతిన్ అలాస్కాలో భేటీ అయ్యారు. ఆ భేటీ జరిగిన కొన్ని గంటలకే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తో,యూరోపియన్ యూనియన్ నేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం జెలెన్‌స్కీ, ట్రంప్ ఇద్దరూ వాషింగ్టన్‌లో భేటీ కానున్నట్లు సమాచారం. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ ఈవిషయాన్ని వెల్లడించారు. అలాస్కాలో సమావేశం అనంతరం తిరుగు ప్రయాణంలో ట్రంప్ జెలెన్‌స్కీతో ఫోన్ మాట్లాడినట్లు తెలి పారు. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. ట్రంప్‌తో గంటన్నరకు పైగా ఫోన్‌లో మాట్లాడానని అన్నారు. శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్‌కు తెలిపినట్లు చెప్పారు. పుతిన్‌తో సమావేశంలో చర్చించిన ముఖ్య విషయాలను ట్రంప్ తనకు తెలియజేసినట్లు వెల్లడించారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇక జెలెన్‌స్కీ చేతుల్లోనే..పుతిన్‌తో భేటీ తర్వాత ట్రంప్

**వాషింగ్టన్,ఆగస్టు 17:** అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన జరిగిన కీలక భేటీ ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిసింది. డీల్ పూర్తికావడంపై నిర్ణయం ఉక్రెయిన్ అధ్య క్షుడు జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందని ట్రంప్ వ్యా ఖ్యానించారు. ఫాక్స్ న్యూస్ ప్రతినిధి సియాన్ హానిటీతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ఆయ నకు సూచిస్తానని చెప్పారు.'ఒప్పందం చేసుకో వాలని జెలెన్‌స్కీకి సూచిస్తా. కానీవాళ్లు అందుకు నిరాకరించే అవకాశంఉంది. రష్యా చాలా శక్తిమం తమైన దేశం.పుతిన్-జెలెన్‌స్కీల సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నా.అందులో నేను కూడా చేరే అవకాశంఉంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

### కాక్‌పిట్ డోర్ తెరిచే ఉంచి నడిపిన పైలట్ సస్పెన్షన్




**లండన్, ఆగస్టు 17 :** విమానం నడుపుతున్న తనను చూసి కుటుంబ సభ్యులు మురిసిపోవాలనుకున్నాడో ఏమో గానీ, ఓ పైలట్ చేసిన పని అతడి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. లండన్‌లోని హీత్రూ నుంచి న్యూయార్క్ వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణ సమయంలో కాక్‌పిట్ డోర్‌ను తెరిచే ఉంచి, ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలపై సస్పె న్షన్‌కు గురయ్యాడు. ఇటీవల హీత్రూన్యూ యార్క్ విమానంలో ఓ పైలట్ కాక్‌పిట్ డోర్‌ను మూయకుండానే విమానాన్ని నడిపాడు. అదే విమానంలో ప్రయాణిస్తున్న తన కుటుంబ సభ్యులకు, తాను విమానాన్ని ఎలా ఆపరేట్ చేస్తానో చూపించాలనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. అయితే, విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్ డోర్ తెరిచి ఉండటాన్ని గమనించిన ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

### 'ఎయిర్ కెనడా' సిబ్బంది సమ్మె: 700 సర్వీసులపై ప్రభావం



**ఒట్టావా, ఆగస్టు 17 :** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫ్లైట్ అటెండెంట్ల సమ్మె నేపథ్యంలో ఎయిర్ కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె నోటీసు గడువు శనివారంతో ముగియడంతో.. ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. తాజా పరిణామంతో రోజుకు 1.3లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. ఇందులో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమానప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత. అయితే, వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ ఈ నెల 13న మూడు రోజుల సమ్మె నోటీసు ఇచ్చింది. నేటితో ఆ గడువు ముగియగా ఇప్పటికీ ఒప్పందం కుదరకపో వడంతో సమ్మె ప్రారంభమైనట్లు ఉద్యోగసంఘం వెల్లడించింది.

### ఓట్లచోరీపై రాహుల్ వ్యంగ్యోక్తుల విడియో



**న్యూఢిల్లీ, ఆగస్టు 17 :** ఓట్ చోరీకి పాల్పడుతోం దంటూ ఎన్నికల కమిషన్‌పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్ చేశారు. బాలీవుడ్ చిత్రం లాపతా లేడీస్ స్ఫూర్తితో ఈ వీడియోను రూపొందించారు. రహస్యంగా, దొంగతనంగా ఇక వద్దు, ప్రజలు మేలుకొన్నారని రాహుల్ ఆ వీడియోతో పాటు ఒక పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక మధ్యవయస్కుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తాడు. ఏమి పోయిందని అధికారి అడుగుతాడు. ఆ వ్యక్తి కొద్ది సేపు ఆగి నా ఓటు అని చెబుతాడు. ఆశ్చర్య పోవడం ఆ పోలీసు అధికారి వంతవుతుంది. ఓటు ఎత్తుకెళ్లడం ఎవరికైనా ఎలా సాధ్యమ వుతుంది? అని ఆయన అడుగుతాడు. నకిలీ ఓట్లద్వారా లక్షలాది ఓట్లు చోరీ అవుతున్నాయని ఆ మధ్యవయస్కుడు జవాబిస్తాడు. ఒకరి ఓటును దోచుకోవడం అంటే ఒకరి హక్కును దోచుకోవడమే అనే సందేశంతో వీడియో ముగుస్తుంది.

### అల్లుడిని స్తంభానికి కట్టేసి కొట్టిన అత్తమామలు

#### ఒడిశా భువనేశ్వర్‌లో చోటు చేసుకున్న ఘటన

**భువనేశ్వర్, ఆగస్టు 17 :** అల్లుడిని అతడి అత్త మామలు స్తంభానికి కట్టేసి కొట్టారు. రాత్రంతా అతడిని అలాగే కట్టేసి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మరునాడు ఉదయం అక్కడకు చేరుకున్నారు. కట్లు విప్పి అతడిని విడిపించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ఒడిశాలోని గజపతి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జలాంత బలియార్‌సింగ్ అనే వ్యక్తిఏడాది కిందట భార్య సుభద్ర మాల్బిసోయేను కొట్టాడు. ఇది తెలిసి గ్రామపెద్దలు అతడ్ని పిలిపించారు. అతడి భార్యను కొన్ని నెలలపాటు పుట్టింట్లో ఉండాలని సూచించారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ గృహ



హింస కేసుపై ఏడాదిగా కోర్టులో విచారణ కొనసాగుతున్నది. కాగా, ఆగస్ట్ 14 రాత్రి వేళ జలాంత బలియార్‌సింగ్ కిరాణా సరుకులు కొనేందుకు తన అత్తమామలు నివసించే గ్రామానికి వెళ్లాడు. అక్కడ వారు కనిపించడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో అత్తింటి వారు అతడిని ఒక స్తంభానికి కట్టేసి కొట్టారు.



### చైనా అద్భుత సృష్టి..

## ఇకపై రోబోలు కూడా పిల్లను కంటాయి..

**బీజింగ్, ఆగస్టు 17 :** శాస్త్రసాంకేతిక విషయంలో చైనా అన్ని దేశాల కంటే ఓ అడుగు ముందే ఉంటుంది. అన్ని విషయాల్లో దేవుడి సృష్టికి ప్రతి సృష్టి చేయడానికి ప్రయత్నిస్తూ ఉంది. కొన్నింటిలో విసయం కూడా సాధించింది. ఈ నేపథ్యంలోనే 'ప్రెగ్నెన్సీ రోబో'ను రూపొందిస్తోంది. సాధారణంగా పిల్లలు కనడంలో ఇబ్బంది ఉన్న భార్యాభర్తలు సరోగసిని ఆశ్రయిస్తూ ఉంటారు. సరోగసిలో భాగంగా భార్యభర్తల నుంచి శుక్రకణాలు, అండాలు సేకరించి వేరే మహిళ గర్భం ద్వారా పిల్లలను కనేలా చేస్తారు. అయితే ఇది బాగా ఖర్చుతో కూడుకున్న పని. పైగా ఇండియాలో వాణిజ్య సరోగసి బ్యాన్‌లో ఉంది. చైనా ప్రయోగం విజయవంతం అయితే మాత్రం సరోగసి కోసం వేరే మహిళలు అవసరం లేదు. రోబోలే పిల్లలను కంటాయి. చైనాకు చెందిన కైవా టెక్నాలజీ ఈ అద్భుత సృష్టికి తెరతీసింది. రోబోలు, మనుషుల పిల్లల్ని ఎలా కంటాయన్న అనుమానం అక్కర్లేదు. ఆ రోబోల్లో కృత్రిమ గర్భాశయాన్ని ఏర్పాటు చేస్తారు. అందులో అండం వృద్ధి చెందుతుంది. 9 నెలల తర్వాత శిశువు బయటకు వస్తుంది. రోబో గర్భంలో బిడ్డ పెరుగుతున్నంత వరకు పైపు ద్వారా పోషకాలను అందిస్తారు. ఈ ప్రోటోటైప్ వచ్చే యేడాది మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రెగ్నెన్సీ రోబోల ధర లక్ష యూవాన్లు.అదే మన ఇండియన్ కరెన్సీ లో చెప్పాలంటే 11 లక్షల రూపాయలుపైనే ఉంటుంది. కైవా టెక్నాలజీ అధినేత డాక్టర్ హాంగ్ కీఫెంగ్ మాట్లాడుతూ 'కృత్రిమ గర్భాశయం తయారీ ఇప్పటికే పూర్తయింది. దాన్ని రోబో కడుపులో అమర్చి పరీక్ష చేయడం మాత్రమే మిగిలి ఉంది. ఇకపై మనుషులు, రోబోలు కలిసి పిల్లల్ని కనొచ్చు. న్యాయపరమైన, సమాజపరమైన సమస్యలకు సంబంధించి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నాం' అని అన్నారు.

## పాకిస్థాన్‌ను ముంచెత్తిన వరదలు: 307 మంది మృతి



**కరాచి, ఆగస్టు 17 :** దాయాది దేశం పాకిస్థాన్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా పాక్ వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోంది. ఈ వర్షానికి మెరుపు వరదలు సంభవించాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, ఇళ్లను వరద ముంచెత్తింది. భారీ వర్షానికి పలు చోట్ల ఇళ్లు, చెట్లు కూలిపోయాయి. కుండపోత వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. ఈ కుంభవృష్టి కారణంగా రెండు రోజుల్లోనే దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర పాకిస్థాన్‌లో భారీ వర్షాలకు సంభవించిన ఆకస్మిక వరదలకు గత 48 గంటల్లో కనీసం 321 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శనివారం తెలిపారు. అత్యధికంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది మరణించినట్లు ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తెలిపింది. వంద మందికిపైగా గాయపడ్డారు. అనేక మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీమ్స్ గాలింపు చేపడుతోంది. వరదలకు సంబంధించిన షాకింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌అవుతున్నాయి. మరోవైపు రానున్న రోజుల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశంఉందని పాక్‌వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈహెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులుప్రజలుజాగ్రత్తగాఉండాలని సూచిస్తున్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత పతకాలు చోరీ



**కోల్‌కతా, ఆగస్టు 17 :** పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్విమ్మింగ్ క్వీన్ బులా చౌదరి ఇంట్లో దొంగలు పడ్డారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా వచ్చిన పలు ప్రతిష్ఠాత్మక పతకాలు, మెమెంటోలు ఎత్తుకెళ్లారు. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని ఆమె పూర్వీకుల ఇంట్లో ఈ చోరీ జరగడంతో తాను జీవితంలో సంపాదించుకున్న సర్వం కోల్పోయానంటూ బులా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలు నేను జీవితాంతం కష్టపడి, ఎంతో అంకితభావంతో సాధించిన అన్నింటినీ దోచుకుపోయారు. క్రీడల్లో గెలుచుకున్న ఆరు బంగారు పతకాలతో సహా అన్ని మెడల్స్, పద్మశ్రీ పతకం కూడా ఎత్తుకెళ్లారని చౌదరి తెలిపారు. తనకు వచ్చిన మెమెంటోలు కూడా దోచుకున్నారని, అయితే అర్జున్ అవార్డు, టెన్జింగ్ నార్గే అవార్డులను దొంగలు వదిలేశారని చెప్పారు. బహుశా సైజులో చిన్నవిగా ఉండ టంతో అర్జున్ అవార్డును, టెన్జింగ్ నార్గే అవా ర్డులను దొంగలు గుర్తించినట్టు లేదని అన్నారు. హిందర్ మోటార్ రెసిడెన్స్‌లో చోరీ జరగడం ఇది మూడోసారని ఆమె చెప్పారు. హిందర్ మో టార్ రెసిడెన్స్ తాళం వేసి ఉంటుంది. అప్పుడ ప్పుడు చౌదరి వెళ్లి చూసుకుంటారు. ప్రస్తుతం ఆమె కోల్‌కతాలోని కస్బా ఏరియాలో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆమె పూర్వీకుల ఇంటిని అక్కడికి కొద్ది దూరంలో ఉంటున్న ఆమె సోదరుడు మిలన్ చౌదరి అప్పుడప్పుడు వెళ్లి చూసుకుంటూ ఉంటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హాలిడే కావడంతో మిలన్ తన సోదరి సూచనల మేరకు ఆ ఇంటిని శుభ్రం చేయించేందుకు వెళ్లారు. లోపలకు వెళ్లగానే ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. వెనుక గేటు తెరిచి ఉండి, గదిలోని వస్తువులు ఎవరో కొల్లగొట్టారు. విషయం తెలిసిన వెంటనే చౌదరి అక్కడకు వెళ్లారు. గతంలో కూడా తన ఇంట్లో దొంగతనాలు జరిగాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని చౌదరి వాపోయారు. దొంగలు నా మెడల్స్ ఎందుకు ఎత్తుకెళ్లారు? ఆ మెడల్స్ వల్ల వాళ్లకు ఏమాత్రం డబ్బులు రావు. అవి నా జీవితంలో సాధించిన విలువైన ఖజానా. నా కెరీర్‌లో సాధించిన విజయాలకు గుర్తులు. ఇల్లు ఖాళీగా ఉండటంతో ప్రతిసారి దొంగలు నా ఇంటిని టార్గెట్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

## భారత్‌పై అదనపు సుంకాలపట్ల మెత్తబడిన ట్రంప్

**అలాస్కా ఆగస్టు 17 :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌పై ఆంక్షలు విధించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన సంకేతాలు ఇచ్చారు. రష్యా ఇప్పటికే భారత్ రూపంలో ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయిందని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. పుతిన్‌తో భేటీ కోసం అలాస్కా పర్యటనకు వెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మాట్లాడారు. పుతిన్ ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయారు. అదే భారత్. ఆ దేశం సుమారు 40 శాతం చమురును కొనుగోలు చేసేదని ఆయన అన్నారు. ఒకవేళ నేను సెకండరీ టారిఫ్‌లు విధించాల్సి వస్తే, అది వారికి చాలా నష్టం కలిగిస్తుంది. అవసరమైతే నేను ఆ పని చేస్తాను. బహుశా ఆ అవసరం రాకపోవచ్చని ట్రంప్ అన్నారు. వాస్తవానికి, ఆగస్టు 27 నుంచి భారత్‌పై 25 శాతం సెకండరీ టారిఫ్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అలాస్కాలో ట్రంప్, పుతిన్ మధ్య చర్చలు సఫలం కాకపోతే భారత్‌పై ఆంక్షలు మరింత పెరగవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




## అలా చేస్తే ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేస్తా: హిల్లరీ క్లింటన్



**వాషింగ్టన్, ఆగస్టు 17 :** తనకుతాను గొప్ప మధ్యవర్తిగా, ప్రపంచ శాంతి దూతగా ఆవిష్కరించుకునేందుకు ఉబలాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపినట్లయితే ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదిస్తానని హిల్లరీ చెప్పారు. అయితే ఒక షరతు ఉందంటూ ట్విస్ట్ ఇచ్చారు. ఉక్రెయిన్ తన భూభాగాన్ని రష్యాకు వదులుకోవాల్సిన అవసరం లేకుండా రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ట్రంప్ ముగించాలని పేర్కొన్నారు. అలా చేసినట్లయితే అమెరికా అధ్యక్షుడిని నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తానని వెల్లడించారు. రేజింగ్ మోడరేట్స్ పాడ్‌కాస్ట్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో హిల్లరీ ఈ మేరకు ప్రకటన చేశారు. నిజాయితీగా చెప్పాలంటే, ఉక్రెయిన్ తన భూమిని దురాక్రమణదారు దేశానికి వదిలివేయాల్సిన అవసరంలేని విధంగా ఇప్పటి వరకు మనం చూడని విధంగా పుతిన్‌కు వ్యతిరేకంగా దృఢంగా నిలబడగలిగే విధంగా మూడేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధాన్ని ముగించేలా చూడాలని హిల్లరీ పేర్కొన్నారు. ట్రంప్ దాని రూపశిల్పి అయితే ఆయనను నోబెల్ బహుమతికి ప్రతిపాదిస్తానన్నారు. కాగా, రష్యా, ఉక్రెయిన్ మధ్య మూడేండ్లుగా సాగుతున్న యుద్ధాన్ని ముగించడమే ప్రధాన అజెండాగా అలాస్కాలో ట్రంప్, పుతిన్ భేటీ కొనసాగింది.

## రూ. 11,000 కోట్లతో జాతీయ రహదారి ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 :** దేశ రాజధానిలో రెండు కీలకమైన నేషనల్ హైవే ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించనున్నారు. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతంలో మెరుగైన కనెక్టివిటీ, రోడ్లపై రద్దీని తగ్గించేందుకు ఈ కీలక ప్రాజెక్టులను ఉద్దేశించారు. సుమారు రూ. 11,000 కోట్ల విలువైన ఈ రెండు ప్రాజెక్టులను రోహిణిలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. తర్వాత అక్కడి వేదిక నుంచి ప్రసంగిస్తారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్టులు ప్రభుత్వ సమగ్ర ప్రణాళికలో భాగంగా ప్రారంభమవుతున్నాయి. దేశ రాజధానిలో మెరుగైన అనుసంధానం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ముఖ్యోద్దేశం.

## ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే దేశానికి స్వాతంత్రం

### ఎల్ఐసి డివిజనల్ సీనియర్ మేనేజర్ డా॥ సుధాకర్ బాబు



**మచిలీపట్నం, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, దానిని మనం సఫలం చేసుకోవాలని ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డా. సుధాకర బాబు అన్నారు. 79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ డా. సుధాకర బాబు జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాతీయ జెండాను గౌరవిం చవలసిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని చెప్పారు. కుల, మతాలకు, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా దేశమంతా కలిసికట్టుగా జరుపుకునే పండుగ స్వాతం త్ర్యదినోత్సవం అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మరియు కృష్ణ జిల్లాలకు చెందిన 24బ్రాంచీలకు చెందిన ఎల్ఐసి అధికారులు, ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

## సీఎం భద్రతా అధికారి ఎస్పి చెన్నుపాటి భద్రయ్యకు రాష్ట్రపతి ప్రతిష్టాత్మక పథకం

**అమరావతి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**



పోలీసు శాఖలో విశిష్టమైన సేవలు అందించి, భద్రతా విధుల్లో అద్భుత ప్రతిభ చాటిన ఎస్పి చెన్నుపాటి భద్రయ్యకు రాష్ట్రపతి ప్రతిష్టాత్మక పోలీస్ మెడల్ లభించింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా కేంద్ర హెూంశాఖ శౌర్య సేవా పతకాలను ప్రధానం చేయగా, రాష్ట్రానికి చెందిన ఇద్దరు అధికారుల్లో భద్రయ్య ఒకరు. గత పదేళ్లలో ఎనిమిది సంవత్సరాలు వరుసగా అత్యున్నత సేవలకుగాను గుర్తింపు పొందిన ఆయన, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగత భద్రతా ముఖ్య అధికారి హెూదాలో కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం బొమ్మనంపాడు గ్రామం లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన భద్రయ్య స్వయం కృషితో అంచలంచలుగా ఎదిగారు. ఈయన తల్లిదండ్రులు ఆదెయ్య, అలివేలమ్మలకు నలుగురు కుమారులు, కుమార్తె సంతానం కాగా భద్రయ్య అందరికంటే చిన్నవాడు. స్వయంకృషితో ఎదిగిన భద్రయ్య 1991లో పోలీసు శాఖలో చేరి, సున్నితమైన, సంక్లిష్టమైన విధులను సమర్థవంతంగా నిర్వహించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో కీలక బాధ్యతలు, పుష్కరాలు, రాజధాని అమరావతి శంఖుస్థాపన, అంతర్జాతీయ సదస్సులు, బాంబు నిర్వీర్యం వంటి విభాగాల్లో ప్రతిభ చాటారు. అమెరికా, యుపి రాష్ట్రాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఆయన, ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో చాంపియన్‌గా నిలిచి, రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారు. భద్రయ్య గౌరవానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సహచర అధికారులు అభినందనలు తెలియజేశారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి

### తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా తిరువూరు శాసన సభ్యులు వారి కార్యాలయము నందు గౌతు లచ్చన్న చిత్రపటానికి పూల మాల వేసి శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, రైతు కాపరి, ప్రజా నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన కృషి వల్లే బీసీలు రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కులు రక్షింపబడ్డాయని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన లచ్చన్న ఆలోచనలు ఈనాటి తరాలకు మార్గదర్శకాలు, ప్రజాసేవకుడిగా ఆయన చూపిన నిజాయితీ, త్యాగం, ధైర్యం ప్రతి నాయకుడికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన కలలు సాకారం చేయడానికిప్రతి ఒక్కరు కృషి చేయాలి అని అన్నారు.

## పలు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించిన కాంగ్రెస్ అధిష్టానం

### ఉత్తరాఖండ్ అబ్జర్వర్‌గా సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు నియామకం

**విజయవాడ, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**



సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమాల నిర్వహణ, డీసీసీ ప్రెసిడెంట్‌ల ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పలు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించింది. పంజాబ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఒడిస్సా రాష్ట్రాలకు అబ్జర్వర్లను నియమించినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, ఎంపీ కె.సి.వేణుగోపాల్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియామకాల్లో భాగంగా ఉత్తరాఖండ్ అబ్జర్వర్‌గా సీడబ్ల్యూసీ మెంబర్, ఏపిసీసీ పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును అధిష్టానం నియమించింది. గతంలో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ గిడుగు రుద్రరాజు అబ్జర్వర్‌గా తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు.

## ఫొటోగ్రఫీ పోటీల్లో ఆలోచనలు

# రేకెత్తించిన ఛాయాచిత్రాలు





- ప్రతి చిత్రం ఒక కళాత్మక సందేశం
- విజేతలకు అభినందనలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు పంపిన ఛాయాచిత్రాలు ప్రతిఒక్కరిలో ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయని.. ప్రతి ఛాయాచిత్రం కళాత్మక సందేశాన్ని అందిస్తున్నాయని.. పోటీల్లో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్ నందు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లలో నైపుణ్యాన్ని మరింత పెంచడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పర్యాటక, సాంస్కృతిక రంగాలతో పాటు ఉత్తమ ప్రెస్ ఫొటోలతో మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో మొత్తం 186 ఫొటో ఎంట్రీలు రాగా వీటిని ఆరుగురు సభ్యులతో కూడిన న్యాయ నిర్ణేతల బృందం ఎంట్రీలను పరిశీలించి విజేతలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొదటి విభాగమైన పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో జీఎన్ రావు (ది హిందూ), సీహెచ్‌వీ మస్తాన్ (ది హాన్స్ ఇండియా), కేవీఎస్ గిరి (ది హిందూ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. సి.మల్లికార్జున్ (ఈనాడు), పి.రాజేష్ (ఆంధ్రజ్యోతి), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్), సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), పి.ప్రసాద్ (ఎస్‌డీఎంఎస్‌డీ), ఎస్ఎస్ విజయబాబు (టైమ్స్ ఆఫ్ ఇండియా) ప్రోత్సాహక బహుమతులు సాధించారని వివరించారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు చెందిన ఫొటోల్లో ఎ.రాజేంద్రప్రసాద్ (ఐ అండ్ పీఆర్), జీఎన్ రావు (ది హిందూ), ఆర్‌వీ అప్పారావు (ఫ్రీలాన్సర్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. కేవీఎస్ గిరి (ది హిందూ), ఎ.రామచంద్రరావు (ప్రజాశక్తి), బి.మరిడయ్య (ఈనాడు), వైవీవీ సత్యనారాయణ (ఈనాడు), సంపత్ కుమార్ (ఈనాడు), ఎంపీఎస్‌కే దుర్గాప్రసాద్ (ఈనాడు)లు ప్రోత్సాహక బహుమతులు సాధించారన్నారు. మూడో విభాగంలో బెస్ట్ న్యూస్ పిక్చర్‌లో సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), జి.మహేశ్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జీవీ నారాయణ (ఆంధ్రజ్యోతి), ఎన్.కిశోర్ (సాక్షి), బి.మరిడయ్య (ఈనాడు), కె.చక్రపాణి (సాక్షి), డి.లక్ష్మణ్ (ఆంధ్రజ్యోతి), బి.సతీష్ కుమార్ (ఆంధ్రజ్యోతి)లు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు కలెక్టర్ లక్ష్మీశ ప్రకటించారు. విజేతలకు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేతలు కె.రవి, సీహెచ్ విజయభాస్కర్, జి.అనిత, టి.శ్రీనివాస్‌రెడ్డి, డి.సీతారాం, కె.రవికుమార్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరిరూ విజేతలేనని.. రాబోయే రోజుల్లో ప్రెస్ ఫొటోగ్రాఫర్లతో పాటు స్టూడియో ఫొటోగ్రాఫర్లు, స్థానిక ఔత్సాహిక ప్రజలకు కూడా పోటీలు నిర్వహించి.. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీఎస్ వీవీ ప్రసాద్, సీనియర్ ఫొటోజర్నలిస్టు సీహెచ్ విజయభాస్కర్, వివిధ ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్.. కార్యదర్శిగా సానా సతీశ్‌బాబు

### ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



**అమరావతి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బి.విజయ్‌కుమార్, కౌన్సిలర్‌గా గౌర్ విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడి పదవికి నామినేషన్ వేసిన బండారు నరసింహారావు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల్లో వివరాలు సరిగ్గా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధికార ప్రతినిధి మ్యాంచో ఫెర్రర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికైన సభ్యులకు రమేశ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వచ్చే నెలలో ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహిస్తామని ఏసీఏ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంది. వైకాపా హయాంలోని ఎపెక్స్ కౌన్సిల్ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజీనామా చేయడంతో మిగిలిన ఏడాది కాలానికి అప్పట్లో ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్, కార్యదర్శిగా సానా సతీశ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ కార్యవర్గ పదవీకాలం ఇటీవల ముగియడంతో తాజాగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న





**విశాఖపట్నం, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, రైతు బాంధవుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్నను బడుగులు ఆరాధ్య దైవంగా భావిస్తారని ఆంధ్రప్రదేశ్ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు కొనియాడారు. విశాఖ జిల్లా గ్రీన్ పార్క్ హెూటల్ కూడలిలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకల సందర్భంగా లచ్చన్న విగ్రహానికి ఎమ్మెల్యే చెన్నుపోయిన వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలోని బలహీన వర్గాలకు చెందిన కులానికి చెందినవారని తెలిపారు. చిన్న వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమానికి దక్షిణ భారతదేశం నుండి లచ్చన్న నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన ఉద్యమాలు నిర్వహించి ప్రజల చేత సర్దార్ బిరుదుతో పిలిపించుకున్న మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధుడని కొనియాడారు. పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మొట్టమొదటి ఆల్ ఇండియా కిసాన్ మహాసభను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. ఆయన మన రాష్ట్రంలో పుట్టడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగులు సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బురిడీ కళ్యాణి మాట్లాడుతూ, బడుగు వర్గాలకు దేవాలయ ప్రవేశం కల్పించడం కోసం, హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ వారికి ఆలయ ప్రవేశం కల్పించి, అంటరానితనం నిషేధం చేసి చూపించారని పేర్కొంటూ గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. ఏసీపీ కె.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆనాడే గుర్తించి పోరాడిన నాయకుడు గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీ ఆశ చూపి భారీగా వసూళ్లు

- వెలుగుచూసిన 353 కోట్ల స్కామ్
- తీవ్రంగా నష్టపోయిన 183 బాధితులు
- పలు ఫిర్యాదులతో రంగంలోకి పోలీసులు
- సుదీర్ఘ విచారణ.. పోలీసుల అదుపులో నిందితులు
- ముగ్గురు నిందితుల అరెస్టు.. బంగారం, వెండి స్వాధీనం
- కోట్ల రూపాయల విలువైన ఆస్తులు అటాచ్ మెంట్




**విజయవాడ క్రైం, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పెట్టిన పెట్టుబడికి అత్యధిక వడ్డీలు పెట్టుబడి పెట్టించిన వారికి అత్యధిక కమిషన్లు.. ఇలా మాయమాటలతో అమాయ కులను తమ ఉచ్చులోకి లాగుకొని కోట్ల రూపా యలు కొల్లగొట్టిన యుపిక్స్ క్రియేషన్ సమస్త బండారాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. హాలీవుడ్ సినిమాలకు యానిమేషన్ వర్క్ చేస్తున్నామంటూ ఇంటర్నేషనల్ గా పేరు ఉన్న కంపెనీగా తమ దంటూ విస్తృత ప్రచారం చేసుకునే కోట్ల రూపాయలు పెట్టుబడి పెడితే అత్యధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపి మోసం చేసిన యుపిక్స్ సంస్థ లో అతి ముఖ్యమైన ముగ్గురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుండి కీలక సమాచారం రాబట్టడంతో పాటు కోట్ల రూపాయలు విలువ చేసే బంగారు వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని రూ 23 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అటాచ్ మెంట్ చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో ఎంతోమంది బాధితులను నిండా ముంచిన యుపిక్స్ సంస్థ చేసిన మోసాలను నిందితుల వివరాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు శనివారం నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో వివరించారు.

### సంస్థ ప్రారంభం ఇలా

2014 వ సంవత్సరంలో నిడుమోలు వెంకట సత్య లక్ష్మి కిరణ్ అనే వ్యక్తి విజయవాడ సత్యనారాయణపురం అది శేషయ్య వీధిలో యుపిక్స్ అనే యానిమేషన్ కంపెనీ ని ఏర్పాటు చేసారు.. దీనిలో సుమారు 70 మంది స్టాఫ్ పని చేసేవాళ్ళు. ఈ క్రమంలో కిరణ్ కి పేరం మాల్యాద్రి, అతని కొడుకు పేరం మహేశ్వర రెడ్డి, కోత్తురి వేణుగోపాల్ రావు, మిట్టపల్లి రాజేంద్ర బాబు ఇతని కొడుకు మిట్టపల్లి రాజీవ్ కృష్ణ వారు పరిచయమై అంధరూ ఏ విధంగానైనా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో 2018 సంవత్సరంలో వీరందరూ ఒక గ్రూప్ గా ఏర్పడి పన్నెండు నెలలకు పదికి పది లక్షలు, పన్నెండు నెలలకు కోటికి కోటి రూపాయలు డిపాజిట్ చేసేవారికి ఆధిక డబ్బులు ఇచ్చే విధంగా ఈ కంపెనీలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని మాయ మాటలు చెప్పి అమాయక ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో వీరు ముందుగా పెట్టుబడి పెట్టి లాభాలు సంపాధించినట్లు చూపిస్తూ వారికి మాయమాటల ద్వారా ఆకర్షించారు. ఈ క్రమంలో వీరు పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు తీసుకున్నారు అదేవిధంగా వీళ్ళ బంధువులు స్నేహితులతో డిపాజిట్ లు చేయించి డిపాజిట్ లను చేయించినదుకు కమీషన్ లను పెట్టుబడుల నుండి వచ్చిన డబ్బులను వారి సొంత ఖాతాలలో మళ్ళించుకున్నారు. ఇందులో మోసపోయిన వాళ్ళలో వీరి సమీప ప్రాంతాలైన నర్సారావు పేట, గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన భాధితులు ఎక్కువగా ఉన్నారు.

### వందల సంఖ్యలో బాధితులు

భాధితులు సుమారు 183 మంది సుమారు రూ.353 కోట్ల రూపాయల ను నగదును యుపిక్స్ గ్రూపు కంపెనీలో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. 2024 సంవత్సరం చివరకు సుమారుగా 194 కోట్ల రూపాయలు వరకు డిపాజిట్‌లను వారిసొంత ఖాతాలలోకి మళ్లించుకు న్నట్లుగా పోలీసుల దర్యాప్తు లో వెల్లడయ్యింది.

### బాధితుల ఫిర్యాదుతో

ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన నరసరావుపేట కు చెందిన త్రిపురమల్లు శ్రీనివాసరావు, కలవకొల్లు దిలీప్ కుమార్‌లు పోలీస్ స్టేషన్ కు వచ్చి సత్యనారాయణపురం ఆధిశేషయ్య వీధిలో యుపిక్స్ క్రియేషన్ కంపెనీలో పెట్టుబడి పెట్టి మోసపోయినట్లుగా ఫిర్యాదు చేశారు. దీనిలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాబాలు ఇస్తామని చెప్పి సుమారు రూ.20 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించి మోసం చేశారని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన సత్యనారాయణపురం పోలీసులు పలు సెక్షన్ల కింద విచారణ ప్రారంభించారు. ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాలతో డి.సి.పి. కె.తిరుమలేశ్వర రెడ్డి ఆద్వర్యంలో విచారణ అధికారి నార్త్ ఏ.సి.పి. డా.స్రవంతి రాయ్, నలుగురు ఇన్ స్పెక్టర్లు, సిబ్బందితో ప్రత్యేకమైన సీట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక సీట్ బృందం వారు ఆధునిక సాంకేతికతను ఆధారంగా చేసుకుని ధర్యాప్తును ప్రారంభించి క్షుణ్ణంగా తనిఖీ చేసింది.

### నిందితులు వీరే

యుపిక్స్ భారీ మోసంపై కేసు ధర్యాప్తులో బాగంగా శనివారం ప్రత్యేక బృందాలకు వచ్చిన సమాచారంతో ఈ కేసులలో నర్సారావు పేట ఏరియాలో నిందితులైన ఇద్దరు వ్యక్తులను, విజయవాడ లో ప్రధాన నింధితుడిని అదుపులోనికి తీసుకుని విచారించి వీరి వద్ద నుండి సుమారు 90లక్షల రూపాయల విలువైన 354 గ్రాముల బంగారు ఆభరణాలు, 21 కె.జి.ల వెండిని ఆభరణాలు, ఒక కారుని, ఒక బి.ఎం.డబ్ల్యూ బైకును, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంక్ అక్కౌంట్ లను ఫ్రీజ్ ఫ్రీజ్ చేసి అరెస్టు చేశారు. ఇవి కాకుండా నింధి తులకు సంబంధించిన సుమారు 23కోట్ల రూపాయల విలువైన ఆస్తుల అటాచ్ మెంట్ కు పెట్టడం జరుగుతుందని సిపి రాజశేఖర్ బాబు తెలిపారు. పోలీసుల అరెస్టు చేసిన వారిలో విజయవాడ, సత్యనారా యణ పురం కు చెందిన నిడుమోలు వెంకట సత్య లక్ష్మి కిరణ్,గుంటూరు జిల్లా, కృష్ణా నగర్ కు చెందిన మిట్టపల్లి రాజేంద్ర బాబు, గుంటూరు జిల్లా, కృష్ణా నగర్ కు చెందిన మిట్టపల్లి రాజీవ్ కృష్ణ లు ఉన్నారు.

### సీపీ ప్రత్యేక అభినందనలు

యుపిక్స్ సంస్థ పలువురు బాధితులను మోసం చేసి కోట్ల రూపాయల కొల్లగొట్టిన కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సిట్ అధికారులను , సిబ్బందిని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వారికి నగదు రివార్డులతో సత్కరించి అభినంధించారు.

# విధి నిర్వాహణలో అలసత్యం వహిస్తే చర్యలు తప్పవు

## మంత్రి కొలుసు పార్ధసారధి




**ఆగిరిపల్లి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

నూజివీడు పట్టణంలో పలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, 30 వ వార్డు శానిటేషన్ వర్కర్లలతో మాట్లాడి పట్టణ శానిటేషన్ పై అరా తీశారు. నేను పట్టణంలో ఎక్కడికి వెళ్లినా మున్సిపల్ శానిటేషన్ పై అనేక మంది ఫిర్యాదులు ఇస్తున్నారని ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని, పాగింగ్ జరగడం లేదని,డ్రైనేజీలో విపరీతంగా చెత్త పేరుకొని పోయి పూడి పోయాయని, తద్వారా దోమలు బెరడ పెరిగి విష జ్వరాలు వస్తున్నాయని అనేక మంది నా దృష్టికి తీసుకొస్తు న్నారని, ఇకపై విధి నిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, ఇన్స్పెక్టర్,ఇతర సిబ్బందిని, మంత్రి కొలుసు పార్ధసారధి హెచ్చరించారు. విధి నిర్వహణలో అజాగ్రత్తగా ఉంటే విధులనుండి తొలిగిస్తాకి కూడా వెనుకాడనని మున్సిపల్ సిబ్బందికి మంత్రి కొలుసు పార్ధసారధి స్పష్టం చేశారు.

# అధిష్ఠానం దృష్టికి రైతాంగ సమస్యలు: బీజేపీ జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు

- కాకుమాను మండలంలో పంట పొలాల పరిశీలన
- రైతులతో మాట్లాడిన బీజేపీ నాయకులు
- రైతన్నల బాధ చూసి చలించిన నాయకులు
- రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**

భూమి పై ఏ రంగంలో అయినా సరే నష్టాలు,కష్టాలు వస్తే వెంటనే ఆ పనిని వదిలేసి వేరే రంగాలలో ప్రయత్నాలు చేస్తారని కానీ ఒక్కరైతు మాత్రం ఎన్ని కష్టాలు వచ్చిన వెనుదిరగక ఆరుగాలం కష్టపడి పనిచేస్తారని అలాంటి రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి.తిరుపతి రావు తెలిపారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకుమాను మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీ పాండురంగ విఠల్,జిల్లా అధ్యక్షులు చెరుకూరి.తిరుపతి రావు లు పలువురు నాయకులతో కలిసి కాకుమాను మండల పరిధిలోని గరికపాడు, కాకుమాను, కొండపాటూరు గ్రామాలలో పర్యటించి వర్ష ధాటికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పలువురు రైతులతో నాయకులు మాట్లాడుతూ వరద అనంతరం అధికారులు దెబ్బ తిన్న పొలాలను పరిశీలించారా లేదా అని అడిగారు.తాము అధికముగా కౌలు కు సాగు చేసే వారమని తమకు స్వంత భూమి లేదన్నారు.ఇప్పటికే రెండు పర్యాయాలు వరి నీ వెద పెట్టగా రెండు సార్లు అధిక వర్షాల కారణంగా పంట పూర్తిగా నీట మునిగి పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.తాము ఇప్పటికే నాటుటకు అప్పులు చేసినామని మళ్ళీ పంట దెబ్బతినడంతో తమకు అగమ్యగోచరంగా ఉందని అన్నారు.ప్రభుత్వం పంట దెబ్బ తిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి. తిరుపతి రావు,రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు శ్రీ పాండురంగ విఠల్ లు మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు రైతాంగ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నాయన్నారు.దేశానికి రైతే వెన్నుముక అని రైతే రాజు అని తెలిపారు. రైతాంగ అభివృద్ధి కు ఉమ్మడి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అధికారుల పని తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.రైతు తన కడుపు మాడ్చుకోనయిన పంట ను సంరక్షించుకుంటాడని అలాంటి రైతులు అకాల వర్షాల ధాటికి పంట నష్ట పోయి బాధపడుతుంటే ఎలా అని ప్రశ్నించారు.తాము వెంటనే స్థానిక పంట నష్ట పోయిన రైతులు సమస్యలను స్థానిక ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల.రామాంజనేయులు దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా అధిష్ఠానం వద్దకు రైతుల సమస్యలను తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా రైతులను ప్రభుత్వం ఆదుకునేలా తమ వంతు గా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.రైతులు అధైర్యపడవద్దు అని ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులకు అండగా ఉంటుందన్నారు.జిల్లా అధ్యక్షులు చెరుకూరి.తిరుపతి రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి మండల రైతుల సమస్యల గూర్చి వివరించినారు.అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలియజేశారు.అనంతరం కొండపాటూరు గ్రామంలో పలువురు రైతులతో బీజేపీ నాయకులు మాట్లాడారు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు రైతాంగ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాయని అందులో భాగంగా పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ ,పీఎం పసాల్ భీమా యోజన,వంటి అనేక రకాల పథకాలు అమలు చేస్తూ రైతాంగ అభివృద్ధి కి కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు భజరంగ్. రామకృష్ణ, శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి రాచగిరి.వెంకట లక్ష్మీ,జిల్లా ఎస్సీ మో ర్చ అధ్యక్షులు డా.దారా.అంబేద్కర్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు యాడ్లపాటి. శ్రీధర్ శర్మ,భాను కిషోర్,సత్యనారాయణ,కిసాన్ మో ర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు,మండల నాయకులు రాం గోపాల్, సజ్జన రావు తదితరులు పాల్గొన్నారు.





# డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న చౌటపల్లి గ్రామ ప్రజలు

**తిరువూరు, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

తిరువూరు నియోజకవర్గం చౌటపల్లి గ్రామం ఇంద్ర కాలనీలో డ్రైనేజీ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడిన ప్రతిసారి కాలనీకి పైఎత్తున అటవీ ప్రాంతం నుంచి వస్తున్న వరద మొత్తం కాల నీలో ఇళ్ల లోపలికి వరద నీరు వచ్చి, రోడ్డుకి ఇరువైపులా నీళ్లు నిలిచి విప రీతమైన దుర్గంధం వస్తూ దోమలు ఎక్కువగా ఉండి ప్రజలు ఇబ్బందులకు గుర వుతున్నారు. దీనివల్ల కాలనీవాసులు అనారోగ్యాలు పాలవుతున్నారు. సిజనల్ వ్యా ధులు ప్రబలుతున్న దీని గురించి అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీ వాసు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని సీజనల్‌వ్యాదుల నుంచికాలనీవాసులను రక్షించాలని కోరుతున్నారు.

# డా. సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించేందుకు అవిరళ కృషిచేసిన గొప్ప వ్యక్తుల్లో డా. సర్దార్ గౌతు లచ్చన్న ఒకరని.. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశా జ్యోతి డా. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంతో పాటు వివిధ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న పాటుపడ్డారని.. ఆయన పాటించిన విలువలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందడుగు వేయాలని సూచించారు. మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఇలాంటి గొప్ప కార్య క్రమాలను ప్రభుత్వం నిర్వహించడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# గౌతు లచ్చన్న జీవితం ఎంతో మందికి అదర్శం

## డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఘన నివాళి



**విజయవాడ, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

గౌతు లచ్చన్న ఎంతో మందికి అదర్శమని,నేటి సమాజం లచ్చన్న చేసిన సేవలు,పోరాటాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలు వేసి అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్.సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమర యోధుడే కాకుండా, శ్రామి కులకు అండగా నిలచి, బలహీన వర్గాల ప్రజల అస్తిత్వాన్ని, హక్కులను అందిం చడానికి పోరాటం చేశారని, గౌతు లచ్చన్న మాట లు, విధానాలు మనకు ప్రేరణనని, యువత ఆయన ఆలోచనను, సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో పౌర సంబంధాల అధికారి డాక్టర్ రజియా షబీనా, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## భగవత్ శ్రీ అరిటాకు రెస్టారెంట్ మెరుగైన సేవలతో రాణించాలి : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సంప్రదాయ భోజనం ప్రియులకు తృప్తికరమైన భోజన పదార్థాలతో సంతృప్తికరమైన భోజన సేవలను అందించి, హోటల్ వ్యాపార రంగంలో ఉన్నతంగా రాణించాలని భగవత్ శ్రీ అరిటాకు రెస్టారెంట్ ప్రారంభ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నూతన వ్యాపార సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

ఆంధ్రాప్యారీస్ తెనాలి బోస్ రోడ్ లొ, నెహ్రూనికేతన్ సమీపానగల,ఫస్ట్ క్రై షోరూం మేడపైన, నాల్గవ అంతస్తులొ, అధునాతనంగా రూపుదిద్దుకున్న , భగవద్ శ్రీ అరిటాకు రెస్టారెంట్ ను, ఆదివారం, కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా తొలుత నూతన వ్యాపార సంస్థ నిర్వాహకులు కమ్మెల మోహనకృష్ణ, నెల్లూరి మోహనరంగా లు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు పూల బొకేతో ఘనస్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనతొ నూతన వ్యాపార సంస్థను ప్రారంభించిన, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్. నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు కుద్దూస్, కౌన్సిలర్ బోయపాటి అరుణ, కమ్మెల రజిని, కమ్మెల శ్రీనివాసరావు , కె. రమాదేవి, తోటకూర వెంకటరమణరావు,జనసేన, తెలుగుదేశం పార్టీలోని వివిధ స్థాయి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి పోలీస్ మెడల్‌కు ఎంపికైన గోళ్ళమూడి మధుసూదనరావుకు అభినందన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావు ను కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ సత్కరించింది. శనివారం పట్టాభిపురంలోని రైల్వే డివిజన్ కార్యాలయంలో మధుసూదనరావు ను పెన్షనర్స్ సంఘనేతలు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, ఎన్.ఎస్.నగేష్ బాబు కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ఈ సందర్భంగా టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ.. స్మగ్లింగ్ ను నిరోధించటానికి అర్.పి.ఎఫ్, కస్టమ్స్ శాఖల మధ్య వున్న అనుబంధాన్ని, సహకారాన్ని, మైత్రి ని వివరించారు. నిబద్ధత, నిస్వార్థ సేవలతో పనిచేస్తున్న మధుసూదనరావుకు రాష్ట్రపతి అవార్డు దక్కటం ప్రతిభకు లభించిన గుర్తింపు అన్నారు. మధుసూదనరావు మాట్లాడుతూ..ఉద్యోగి పురోభివృద్ధికి పురస్కారాలు ప్రోత్సాహలుగా పనిచేస్తాయన్నారు. వృత్తిలో అంకితభావం, పట్టుదల ఉంటే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చునన్నారు. అనంతరం అర్.పి.ఎఫ్ శాఖలోని పలువురు అధికారులు, సిబ్బంది మధుసూదనరావును అభినందించారు.

## సీఎం సహాయనిది చెక్కులు అందజేత



**వినుకొండ,(జర్నలిస్ట్ ఫైల్):** నియోజకవర్గం లోని పలు గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు 44,45,104 సీఎం సహాయనిధి చెక్కులను శనివారం టిడిపి కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో అండగా నిలుస్తుంది అన్నారు. పార్టీలకతీతంగా కేవలం అర్హత ప్రామాణికంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 4.0,ప్రభుత్వపాలసి ముస్లీమ్ మైనార్టీలకు ప్రయోజనకరం : ఆడిటర్ ఫర్వేజ్




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ముస్లిం మైనార్టీలు వ్యాపార రంగంలో రాణించేందుకు కేంద్ర ప్రభుత్వం చక్కని రుణ పరపతి పథకాన్ని అమలు చేస్తుందని, చేసే వ్యాపారం పట్ల అవగాహన పెంచుకుని, వ్యాపారం నైపుణ్యంతో అనుకున్న లక్ష్యాలు సాధించాలని విజయవాడకు చెందిన ఆడిటర్ ఫర్వేజ్ పేర్కొన్నారు. పట్టణంలోని హుబ మసీద్ సమావేశపు హాల్లో శనివారం ముస్లిం మైనార్టీ వ్యాపార రంగాల వారికి, యువతకు, స్కిల్ డవలప్ మెంట్ అంశాలపై వర్క్షాప్ నిర్వహించారు మహమ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన వర్క్షాప్ లో విజయవాడకు చెందిన ఆడిటర్ ఫర్వేజ్ ముఖ్య అతిధిగా పాల్గొని,ముస్లిం మైనార్టీ వ్యాపారుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వపరంగా వ్యాపార రంగంలో రాణించడానికి ఉన్న అవకాశాలను వివరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల వ్యాపార అభివృద్ధి కోసం 4.0 పాలసీని తీసుకువచ్చారని, దేశంలో మరెక్కడ ఇటువంటి పాలసీ అమల్లో లేదన్నారు. ముస్లిం మైనార్టీలు వ్యాపార పరంగా రాణించేందుకు, వారి సందేహాలను, నివృత్తి చేశారు. వ్యాపార రంగంలో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తుందని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జానీ, తదితర ముస్లిం మైనార్టీ యువత పాల్గొన్నారు.

# యోగా జీవితంలో భాగమవ్వాలి

- పిల్లలకు యోగా నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే..
- నియోజకవర్గంలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం
- ఆరోగ్యకర దేశం యోగాతోనే సాధ్యం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- యోగా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. స్థానిక అరండల్ పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధర్యంలో నిర్వహించిన యోగా చాంపియన్ షిప్ -2025 విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రస్తుతం ఉందని, కానీ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందరికీ ఐశ్వర్యంకంటే ఆరోగ్యం ప్రధానమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను అనుసరించాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రతి రోజూ విద్యార్థులను యోగా కేంద్రాలకు తీసుకెళ్లడాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. అప్పుడే పిల్లలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కలిగిన పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. నియోజకవర్గంలో అనేక పేద వర్గాలు నివసించే ప్రాంతాలు ఉన్నాయని, వీరికి యోగాను చేరువ చేయాలని సూచించారు. యోగా గురువులు కొంత సమయాన్ని పేద వర్గాలు నివసించే ప్రాంతాల్లో యోగా కేంద్రాల నిర్వహణకు కేటాయించాలని కోరారు. తద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని అందించిన వారవుతామని తెలిపారు. కార్యక్రమంలో కెనడీ స్కూల్ డైరెక్టర్ కే శ్రీకాంత్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకమ్మ రావు, యోగా టీచర్ వెంకట్, టీడీపీ నేత చిట్టాబత్తుని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ టీడీపీ

- రజక ముఖ్య నేతల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసినది తెలుగుదేశం పార్టీ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలు ప్రాంతాల రజక ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ రజకులు ఎప్పటి నుండో తమ పని తాము చేసుకుంటూ, వారికి వచ్చే పదిరూపాయలతోనే జీవనం సాగించే వారు. ఇప్పటికీ రజకులు అనేక ఇబ్బందుల్లో ఉన్నారు. అయితే రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేసిన పార్టీ తెలుగుదేశమే. టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం, అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రజకుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు కేటాయించి, అవసరమైన చోట్ల ధోబీ ఘాట్‌ల నిర్మాణం చేపట్టింది. ఉచిత విద్యుత్, ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించడం, ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించడం, చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించడం వంటి అనేక నిర్ణయాలు తీసుకుందన్నారు. రజకులకు నిజమైన ఆత్మీయ బంధువు చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. రజకుల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్తుందని, ఇందులో భాగంగానే తనను ఎమ్మెల్యే చేసిందని, తన పరిధిలో రజకులకు మెరుగైన రాజకీయ అవకాశాలు కల్పిస్తానని, రజకులకు జరుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం" అని గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా రజక నాయకులు మాట్లాడుతూ "రజకుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారిని మేము మా ప్రతినిధిగా చూస్తున్నాం. భవిష్యత్తులో రజకులకు మరింత రాజకీయ అవకాశాలు కల్పించే నాయకత్వం గళ్ళా మాధవిదే" అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరు మరియు పరిసర ప్రాంతాల రజక నాయకులు, సోదరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## పెదవడ్లపూడి గ్రామంలో ఘనంగా మక్కా మసీదు భూమి పూజ



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని రైలుపేట ప్రాంతంలో మక్కా మసీదు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంనకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజల సహకారం వల్లే ఈ నిర్మాణం సాధ్యమవుతోందని, భవిష్యత్తులో ఈ మసీదు ద్వారా ముస్లిం సోదరులు చిరకాల కోరిక నెరవేరిందని ఆయన అన్నారు. అలాగే తన వంతు సహాయం గా 200 సిమెంట్ కట్టలు మక్కా మసీదు నిర్మాణంనికి అందజేస్తున్నట్టు తెలిపారు. మక్కా మసీదు అనేది మా ముస్లిం సోదరుల ఆత్మీయ కోరిక. ఈ మసీదు పూర్తయితే ఆ ప్రాంతానికి ఒక ఆధ్యాత్మిక కేంద్రమే కాకుండా సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది" అని తెలిపారు. మసీదు నిర్మాణానికి గ్రామస్థుల నుంచి వస్తున్న సహకారం ప్రశంసనీయం అని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రార్థనలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కా మసీదు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు, మత పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం కమిటీ ఆధ్వర్యంలో సుమారు 3,000 మందికి ప్రత్యేకంగా భోజన వసతులు కల్పించారు. భూమి పూజ అనంతరం భక్తులకు అందించిన విందులో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారులి.

## శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి కుటుంబం



**వలేటివారిపాలెం, (జర్నలిస్ట్ ఫైల్):** మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యే కి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి అన్నదాన ప్రసాద భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం,పార్టీ నాయకులు ప్రగడ శ్రీనివాసులు, చుండి అక్కయ్య, కాకుమాని హర్ష, శనివారపు మాల్యాద్రి తదిదరులు పాల్గొన్నారు.

## విజయవాడలో సంచార జాతుల మహాసభకు బీజేపీ సన్నాహాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సంచార, అర్ధసంచార, విముక్త జాతుల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తోందని పార్టీ నేతలు తెలిపారు. చంద్రమౌళినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆగస్టు 30న విజయవాడలో జరగబోయే సంచార, అర్ధసంచార, విముక్త జాతుల మహాసభపై నేతలు వివరాలు వెల్లడించారు.

రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ సంచార జాతుల అభ్యున్నతే బీజేపీ ధ్యేయమని తెలిపారు. అంత్యోదయ లక్ష్యంతో ఈ వర్గాల కలలు నెరవేర్చడానికి కృషి చేస్తోందన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కాలంలోనే సంచార జాతుల జనాభా లెక్కలు మొదలయ్యాయని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సీడ్ పథకం, డివిన్టి కమిషన్‌ను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ వర్గాల ప్రతిభకు గుర్తింపుగా పద్మ అవార్డులు అందజేయడం గర్వకారణమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ... విజయవాడలో జరగబోయే 'స్ఫూర్తి మహాసభ'ను సంచార సమాజం ఆత్మగౌరవ పండుగలా చేసుకోవాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచార కులాల పెద్దలను కలసి సభకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలో సంచార జాతుల చరిత్ర, త్యాగం, పోరాటం, డిమాండ్లు ప్రజలకు, ప్రభుత్వాలకు తెలియజేయబడతాయని పేర్కొన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఆగస్టు 31న విముక్త జాతుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పిలుపుతో 'స్ఫూర్తి' ప్రతిష్టాత్మకంగా జరగనుందని చెప్పారు. ఈ సందర్భంగా శోభాయాత్ర, అవార్డు ప్రదానాలు, కళాకారుల సత్కారాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సంచార సమాజ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రోడ్‌మ్యాప్‌ను సభలో ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, మంత్రి సుగుణ, నారాయణరెడ్డి, మోతే శేషగిరి, దారా అంబేద్కర్, రమాదేవి, బండారుపల్లి రోశయ్య, పడమట రాదాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## త్రయాహ్నిక దీక్షగా శ్రీకాలభైరవస్వామి విగ్రహప్రతిష్ట



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కాలభైరవ స్వామి దర్శనం దివ్య అనుగ్రహమని విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేళ, ఆలయ ప్రధాన అర్చక స్వామి చావలి శ్రీనివాసరావు భక్తులకు నుద్దేశించి అన్నారు.

మండలంలోని పెదరావూరు గ్రామంలో వేంచేసియున్న,శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో కుర్తాళం శంకరాచార్యులు శ్రీ సిద్దేశ్వరానంద భారతి స్వామి అనుగ్రహంతో, పాటిబండ్ల కోటేశ్వరరావు రవిచంద్రిక దంపతుల వితరణతొ,ఆదివారం శ్రీకాల భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని త్రయాహ్నిక దీక్షగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఈ విశేష కార్యక్రమాల్లో అశేష సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆలయ ప్రధానఅర్చక స్వామి చావలి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ కాలభైరవ స్వామి అనుగ్రహ విశిష్టతను వివరించారు. భక్తులు కాలభైరవ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి శ్యామ్ సుందర్ బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఏపీయూడబ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ



- యూనియన్ 69 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుక

**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీయూడబ్ల్యూజే మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో పాత మంగళగిరిలో గల సౌజన్య వృద్ధుల ఆశ్రమం నందు ఆదివారం సాయంత్రం పండ్లు పంపిణీ చేశారు. 1957లో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించిందని యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ సాధించిన విజయాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు తాడిబోయిన నాగేశ్వరరావు (టి ఎన్ ఆర్), మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి బత్తుల సాంబశివరావు (సాంబ), యూనియన్ నాయకులు పల్లి ప్రకాష్ బాబు, శివరాత్రి శ్రీనివాసరావు, అన్వర్ ఖాన్, గాజుల సురేష్, ఇంధనం నాగరాజు, ఆరేపల్లి తేజ మణికంఠ, ఆశ్రమ వ్యవస్థాపకులు నందం జోగేంద్ర చక్రవర్తి, నిర్వాహకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో కరేడు కార్యక్రమానికి అనుమతి లేదు




- కందుకూరు డి ఎస్ పి బాలసుబ్రమణ్యం

**కందుకూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ పేరుతో ఈ నెల 18 న తలపెట్టిన ఛలో కరేడు కార్యక్రమానికి ఎటువంటి ముందస్తు అనుమతులు లేవని కందుకూరు డి ఎస్ పి బాలసుబ్రమణ్యం శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమం పేరుతో బయట వ్యక్తులు భూసేకరణ గ్రామాలలోని రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారి నుండి రక్షణ కల్పించాలని పలువురు ఉలవపాడు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినట్లు డి ఎస్ పి తెలియజేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా ఇప్పటికే గ్రామంలో 30 యాక్టు మరియు రెవిన్యూ వారు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఛలో కరేడు కార్యక్రమానికి సంబంధించి బయట వ్యక్తులు ఎవరైనా గ్రామంలోనికి వచ్చి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు గాని ఇతర చర్యలకు గాని పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి ఎస్ పి తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు సి ఐ షేక్ అన్వర్ భాషా, ఉలవపాడు ఎస్ ఐ కె అంకమ్మ లు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణానది వరద ప్రకాశం బ్యారేజి వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి ఇన్, ఔట్ ఫ్లో 2.87 లక్షల క్యూసెక్కులు ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో రేపు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉందన్నారు. గోదావరి వరద ధవళేశ్వరం వద్ద 4.07లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నదులు, పొంగిపొర్లే వాగులు,కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ప్రభుత్వం కళ్లకు గంతలు కడుతున్న నాగార్జున విశ్వవిద్యాలయం తాత్కాలిక వీసీ

- ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలకు చేరేలా నకిలీ వినతి పత్రాలు సృష్టించిన వర్శిటీ మేధావులు
- పలు విద్యాసంఘాల పేరిట కృత్రిమ వినతి పత్రాలు సృష్టించిన వైనం
- స్థానికుడైన తనకే రెగ్యులర్ వీసీ పదవి ఇవ్వాలని వినతి పత్రాలలో అభ్యర్థన
- "తన పదవీ కాంక్షను కళాశాల సంఘాల అభ్యర్థనగా చూపిన వైఖరి"
- నకిలీ వినతి పత్రాల వెనుక వర్సిటీలో ఓ "పరీక్షల కో ఆర్డినేటర్"
- వర్సిటీలో అత్యంత వివాదాస్పద పరీక్షల కో ఆర్డినేటర్ గా ఆయనకు గుర్తింపు
- ఒక బలమైన సామాజిక వర్గం నుండి సైతం ప్రభుత్వ పెద్దలను వత్తిడి చేస్తున్నట్లుగా సమాచారం
- స్థానికేతరులు వీసీ ఐతే తమ అక్రమ అవినీతి సంపాదన కు అడ్డుపడాతరనే ఈ వ్యూహమా?
- ప్రజాప్రతినిధులు, ప్రభుత్వపెద్దలు,విద్యా శాఖ తాత్కాలిక వీసీ ట్రాప్ లో పడనున్నారా?



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో గురువు అంటే విద్యార్థులకు అక్షర జ్ఞానం, లోకజ్ఞానం, ఇంకిత జ్ఞానం, సంస్కారం,నైతిక విలువలు నేర్పించే పరమ పవిత్రమైన స్థానం. అధ్యాపకుడంటే విద్యార్థులకు జీవితంలో మంచి నడక, నడత,నిజాయితీ,నిబద్ధత నేర్పే స్ఫూర్తి ప్రదాత. అంతటి మహోన్నత విశిష్ట స్థానం కలిగిన అధ్యాపకులలో కొందరు తమ స్వార్థం తో నైతికతను కోల్పోయి తీవ్రమైన పదవీ వ్యామోహంతో విద్యావ్యవస్థను ప్రభుత్వాన్ని ,సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. పంట చేలో కలుపు మొక్కల్లా కొందరు చేసే నీతిమాలిన వ్యవహారాలు ఉపాధ్యాయ వృత్తికి,విద్యా వ్యవస్థకు కళంకం గా మారుతున్నాయి. వివరాలలో కి వెళితే... భారతదేశంలో, ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఐదు దశాబ్దాలుగా ఎంతో కీర్తి ప్రతిష్టలు కలిగిన విశ్వవిద్యాలయంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కొనియాడబడుతోంది. అయితే ఇటీవల ఆ వర్సిటీ అడుగడుగునా వివాదాలలో నిలుస్తోంది. పలువురు అధ్యాపకులు పాఠ్యాంశ బోధనపై కాకుండా పదవీ వ్యామోహంతో వివిధ పదవుల పై దృష్టి పెడుతున్నారు. ఆయా పదవులను తమ ఆదాయ మార్గాలుగా మార్చుకుంటుండటంతో తరచుగా వర్సిటీ వివాదాస్పదమవుతుంది.

వర్శిటీ వీసీ పీఠం కోసం స్వయంగా ప్రస్తుత తాత్కాలిక వీసీ అనైతిక, మోసపూరిత చర్యలకు ఉపక్రమించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల వారు, ఇంజనీరింగ్ కళాశాలల వారు,బిఈడీ కళాశాలల యాజమాన్యాలు,ఫార్మసీ కళాశాలల వారు,వివిధ కళాశాలల ఆచార్యుల బృందం,బోధనేతర సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వాన్ని ప్రభుత్వ పెద్దలను పలువురు ప్రజా ప్రతినిధులకు ప్రస్తుత తాత్కాలిక వీసీ కంచర్ల గంగాధర రావునే రెగ్యులర్ వీసీ గా నియమించమని విన్నవించుకుంటున్నట్లుగా నకిలీ వినతి పత్రాలను సృష్టించారు. వర్సిటీలోని అంతర్గత కళాశాల సిబ్బందే కాకుండా వర్సిటీ పరిధిలోని ప్రతీ కళాశాల యాజమాన్యాలు అందరూ విన్నవించుకుంటున్నట్లుగా పలు సంఘాల పేర్లతో వినతి పత్రాలను సిద్ధం చేయించారు.

వాస్తవానికి వర్శిటీ అంతర్గత కళాశాలల సిబ్బందికి కానీ,వర్సిటీ పరిధిలోని కళాశాలల సిబ్బంది గానీ ఈ విధమైన వినతి పత్రాలను సమర్పించలేదు.. ఆయా కృత్రిమ వినతి పత్రాలను ఎవరికి వారు సమర్పిస్తున్నట్లుగా కొన్ని సంఘాల పేర్లను సైతం కొత్తగా అప్పటి కప్పుడు పుట్టించడం గమనార్హం. వాటిల్లో కొన్ని....ఎ ఎన్ యు డిగ్రీ కళాశాలల సంక్షేమ సమితి , ఎ ఎన్ యు పీజీ కళాశాలల సమాఖ్య, ఎ ఎన్ యు ఫార్మసీ కళాశాలల బృందం, ఎ ఎన్ యు ఇంజనీరింగ్ కళాశాలల సమాఖ్య, ఎ ఎన్ యు టీచర్స్ అసోసియేషన్,ఎ ఎన్ యు నాన్ టీచింగ్ అసోసియేషన్, ఎ ఎన్ యు బిఈడీ కళాశాల యాజమాన్యం అని పలు సంఘాల పేర్లను సైతం అప్పటికప్పుడే నిర్ణయించేశారు. ఆయా సంఘాల పేర్లతో... స్థానికుడైన తాత్కాలిక వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ రావునే వీసీగా నియమించమని అడుగుతున్నట్లుగా పలు లేఖలను సిద్ధం చేసి ప్రభుత్వ అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు, ప్రజాప్రతినిధులను మోసం చేసే ప్రయత్నం కు తెర తీశారు.

ఈవిధమైన ఈ నీతిమాలిన వ్యవహారం అంతటినీ వర్సిటీలో పరీక్షల కోఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఓ అధ్యాపకుడు అన్నీ తానై నడిపించారు. స్థానికేతరులు ఎవరైనా వీసీ అయితే తమ అవినీతి అక్రమ సంపాదనకు అడ్డుకట్ట వేస్తారనే సదరు అధ్యాపకుడు ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నట్లుగా సమాచారం.రాష్ట్రప్రభుత్వం ,ప్రభుత్వ పెద్దలు ,విద్యా శాఖ అధికారులు వర్శిటీలోని అధికారుల ట్రాప్ లో పడకుండా సమర్థవంతమైన విద్యావేత్త ను వర్సిటీకి ఉపకులపతిగా నియమించడం అత్యావశ్యకం. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సమాజానికి దిక్సూచిలా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ అధ్యాపక వృత్తిలో ఉంటూ ఇలాంటి ధర్మ విరుద్ధమైన మోసపూరిత అనైతిక చర్యలకు ఉపక్రమించిన అధ్యాపకులకు సరియైన గుణపాఠం నేర్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

## వైద్యులు లేరు... మందులు ఉండవు మూతపడుతున్న ఆయుష్ కేంద్రాలు



**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్న వైద్యం. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అంతేకాదు అల్లోపతితో తగ్గని అనేక రుగ్మతలు సైతం ఆయుర్వేదం, హోమియోతో నయమవుతాయని ఇప్పటికీ చాలా మంది విశ్వసిస్తుంటారు. అయితే పాలకుల నిర్లక్ష్యంతో భారతీయ సంప్రదాయ వైద్యం ప్రజలకు అందడం లేదు. గత వైఎస్సార్సీపీ సర్కార్ వైద్యానికి పెద్దఎత్తున నిధులు వెచ్చించామని మభ్యపెట్టి పల్లె వైద్యశాలలకు తాళం వేసి వాటి ఆయువు తీసేసింది. అయితే ఇప్పటికీ అవి తిరిగి తెరుచుకోకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు.

ఏలూరు జిల్లాలో ఆయుష్ కేంద్రాలకు జబ్బు చేసింది. ఆయుష్ విభాగం కింద 32 డిస్పెన్సరీలు ఉండగా వీటిలో ఆయుర్వేదం 18, హోమియోపతి 10, 4 యునాని కేంద్రాలున్నాయి. అయితే వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ప్రాచీన వైద్యం అందని ద్రాక్షగానే మారింది. పలు చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పరాయి పంచన ఇరుకు గదుల్లోనే నెట్టుకొస్తున్నారు. కాగుపాడు, పెదపాడు, చెట్టున్నపాడు, ముసునూరు, చాట్రాయిలోని ఆయుర్వేద కేంద్రాల్లో వైద్యులు లేరు. సిబ్బంది కొరతతో భీమడోలు, ఆగిరిపల్లిలోని హోమియో వైద్యశాలలు మూతపడ్డాయి.

వేలేరుపాడు మండలం రేపాకగొమ్ములోని ఆయుర్వేద వైద్యశాల మూడేళ్ల కిందట వరదలు రావడంతో ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. ఆరు నెలల క్రితం వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి మార్చారు. చాలీచాలని గదుల్లోనే రెండింటినీ నిర్వహించడం కష్టతరంగా మారింది. కామవరపుకోట మండలం తడికలపూడిలోని హోమియో వైద్యశాలను సహకార సంఘం భవనంలోని చిన్న ఇరుకు గదిలోనే నిర్వహిస్తున్నారు. కొయ్యలగూడెంలోని హోమియో వైద్యశాల భవనం పూర్తిగా పాడుపడింది. స్థానికంగా మరో భవనంలోకి మార్చినా అది కూడా శిథిలావస్థలోనే ఉంది. కొన్నిచోట్ల ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నా వైద్యులు లేకపోవడంతో ఎప్పుడూ తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయుష్ కేంద్రాలకు ఊపిరి పోయాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యులను నియమించి మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

"ఆయుర్వేద ఆసుపత్రికి డాక్టర్లు లేరు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం డాక్టర్‌ని నియమించలేదు. జిల్లాలో చాలా మంది ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడ్డారు. వైద్యులు లేకపోవడంతో అంతా గుంటూరుకి వెళ్లాల్సి వస్తుంది. జిల్లాలోని పలు గ్రామస్థులకు గుంటూరు వెళ్లాలంటే ఏడు ఎనిమిది కిలోమీటర్లు అవుతుంది. దీంతో చాలామంది అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిని గుర్తించి మంచి డాక్టర్‌ని నియమించాలని కోరుతున్నాము". **- ఏలూరు జిల్లావాసి**

"ప్రస్తుతం ఆయుర్వేదం, హోమియో, యునాని కేంద్రాలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో చాలా మంది అల్లోపతి మందులు వాడలేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి, తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. మందులను కేటాయించాలని, సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము". **- స్థానికులు**

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆగస్టు 25 దరఖాస్తులకు చివరి గడువు..త్వరితగతిన అప్లై చేసుకోవాలని ఏపీటీఏ పిలుపు
- కోర్సులు పూర్తైన అనంతరం ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగాల కల్పన
- ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సీఈవో

**తిరుపతి , (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహించబడుతున్న స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ మరియు అప్లైడ్ న్యూట్రిషియన్ 2025-2026 సంవత్సరానికి హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బి.ఎస్.సి (హెచ్ అండ్ హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ లో 40 శాతం పైబడి మార్కులు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సుకు ఎస్.ఎస్.సి పాసైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు ఎస్.ఎస్.సి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సులకు వయోపరిమితి లేదని స్పష్టం చేశారు.కోర్సులు పూర్తయిన అనంతరం ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లోఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు.యువతీ యువకులకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. దరఖాస్తులను ఆగస్టు 25 లోగా తిరుపతిలోని కళాశాలకు పంపాలన్నారు. దరఖాస్తులు www.sihmtpt.org నుంచి పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9701343846, 9100558006, 9700440604 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. త్వరితగతిన అప్లై చేసుకొని ఈ సదావకాశాన్ని వినియోగించుకొని ఉపాధి పొందాలని ఏపీటీఏ సీఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కాలానికి అతీతమైన శ్రీకృష్ణుని బోధనలు అందరికీ అనుసరణీయం



- ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్

**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):** జీవితంలో సంక్లిష్టమైన సమస్యలను సులువుగా పరిష్కరించుకోవటానికి కాలానికి అతీతమైన భగవద్గీతలోని శ్రీకృష్ణుని బోధనలు ఉపకరిస్తాయని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విజయవాడలోని ఇస్కాన్ మందిర్ లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ శ్రీకృష్ణుని బోధనలు జీవితం,వ్యక్తిత్వ వికాసం మరియు ధర్మం పట్ల పూర్తి అవగాహన కలిగించే విధంగా ఉంటాయన్నారు. క్రమశిక్షణ, ప్రశాంతతను పొందే పద్ధతులను భగవద్గీత సూచిస్తుంద న్నారు.దౌత్యం,వ్యూహాత్మకమైన నిర్ణయాలు, సృజనాత్మకతతో సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలను భగవద్గీత ద్వారా తెలుసుకోవచ్చన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు సమకాలీన సమాజంలో సందర్భాన్ని బట్టి వినియోగించు కోవాలన్నారు. నిత్య జీవితములో విలువైన పాఠాలను నేర్చుకోవటానికి కృష్ణుని బోధనలు దోహదపడతాయన్నారు.

## బడుగు,బలహీన వర్గాల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు బాంధవుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు విశాఖలో ఘనంగా జరిగాయి. నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్ కూడలిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు, పలువురు బీసీ నాయకులు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన గౌతు లచ్చన్న 17 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టారని, 33 ఏళ్లకే క్విట్ ఇండియా ఉద్యమానికి దక్షిణ భారతదేశం నుంచి నాయకత్వం వహించిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన ఉద్యమాలలో కీలక పాత్ర పోషించి ప్రజలచే "సర్దార్" బిరుదు అందుకున్న తొలి స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి ముందు, తరువాత కూడా లచ్చన్న రాజకీయాలను గణనీయంగా ప్రభావితం చేశారని, అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఎమ్మెల్సీగా సేవలందించారని చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటి ఆల్ ఇండియా కిసాన్ మహాసభను ఆయన నిర్వహించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి బురిడీ కళ్యాణి మాట్లాడుతూ, బడుగు వర్గాలకు ఆలయ ప్రవేశం కల్పించడంలో, అంటరానితన నిర్మూలనలో లచ్చన్న కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏసీపీ కె. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు అవసరమని అప్పుడే గుర్తించిన మహానాయకుడు లచ్చన్న అని అన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ, అట్టి మహనీయుని జయంతి-వర్ధంతులను ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమని, సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## పోలేరమ్మ, శ్రీ మహా లక్ష్మీ అమ్మవారి కొలుపులు పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో ఆధ్యాత్మిక భక్తి ఉత్సాహంతో పోలేరమ్మ కొలుపులు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నగర్ (వడ్డెరగూడెం)లో గల శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగిన కొలుపులు మరియు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో వార్షిక కొలుపుల్లో భాగంగా పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ "పోలేరమ్మ తల్లి గుంటూరు నగరానికి ఆరాధ్యదేవత. ప్రతి ఏటా జరిగే కొలుపులు భక్తుల విశ్వాసాన్ని , సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పు తాయన్నారు. అన్నదానం మహాదానం అని శాస్త్రాలు పేర్కొన్నట్లుగా భక్తులతో కలిసి అన్నప్రసాద సేవలో భాగం కావడం నా పుణ్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

**శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు నగరంలోని ఇస్కాన్ హరే కృష్ణ గోకులక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని శ్రీకృష్ణుడికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ "శ్రీకృష్ణ జన్మాష్టమి భక్తి, ధర్మం, సత్యం, కర్తవ్యపరాయణతకు ప్రతీక అని, భగవత్గీతలో శ్రీకృష్ణుడు ఇచ్చిన బోధలు నేటికీ సమాజానికి మార్గదర్శనమున్నారు. ఆ బోధలను ఆచరణలో పెట్టినప్పుడు శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం నెలకొంటాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవిని నిర్వాహకులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం కావాలి




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పాఠశాల విద్యలో నెలకొన్న అకాడమిక్ సమస్యలు, ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం కోరింది.

గొల్లపూడి ఏఐటీయూసీ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు అధ్యక్షతన శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విద్యా, ఉపాధ్యాయ, ఆర్థిక పరమైన సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏ. సదాశివరావు, రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి యస్. చిరంజీవి సమావేశ తీర్మానాలను వెల్లడించారు.

ఉపాధ్యాయుల బోధనా స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లు, అనవసరమైన అడ్డంకులను తొలగించాలని ఏపిటిఎఫ్ డిమాండ్ చేసింది. గత టిడిపి ప్రభుత్వంలో జారీ చేసిన 72, 73, 74 ఉత్తర్వులను అమలు చేయడానికి అధికారులు%-%ఉపాధ్యాయ సంఘాలతో కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. 73వ జి.ఓ ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల విషయంలో వివక్షత కొనసాగు తోందని, ప్రస్తుత డీఎస్సీ నియామకాల్లో యాజమాన్యాల వారీగా కౌన్సిలింగ్ చేయడం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని పేర్కొంది. పంచాయతీరాజ్ యాజమాన్యంలోని ఉపాధ్యాయులు మరణించినా గత ఐదేళ్లుగా కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం దారుణమని, వెంటనే కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసింది. అంతర్ జిల్లా బదిలీలను తక్షణమే నిర్వహించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం జారీ చేసిన 57వ మెమోను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపిటిఎఫ్ స్పష్టం చేసింది.

ప్రతినెల ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కింద డిడక్షన్లు జరుగుతున్నప్పటికీ ఏ కార్పొరేట్/ప్రైవేట్ ఆస్పత్రులు చికిత్స చేయడానికి సిద్ధంగా లేవని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా 12వ పిఆర్సి కమిషన్‌ను నియమించకపోవడం, డి.ఏలు మంజూరు చేయకపోవడం, 21 వేల కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయకపోవడం, పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ ఇవ్వకపోవడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఏపిటిఎఫ్ స్పష్టం చేసింది.

సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు కోసం ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈఏ ఆధ్వర్యంలో జరుగనున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఏపిటిఎఫ్ తెలిపింది.

ఈ సమావేశంలో ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి. సత్యనారాయణ, చీఫ్ పాట్రన్ కె. సుబ్బారెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్ రాయమందడి, ఉపాధ్యక్షులు డి. ఈశ్వర్ రావు, కార్యదర్శులు తమ్ము నాగరాజు, పి. ధనుంజయ రావు, నగరి శ్రీనివాసులు, పివి సుబ్బారావు, మహిళా ప్రతినిధి బాల త్రిపుర సుందరి, మేగజైన్ మేనేజర్ బిన్నీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రియాజ్ అహ్మద్ తో పాటు జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## రిజిస్టర్ సంఘాలను కూడా చర్చలకు పిలవాలి



- నల్లపల్లి విజయ్ భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్

**అమరావతి , (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20 న గుర్తింపు ఉన్న ఉద్యోగ సంఘాలతో మాత్రమే కాకుండా రిజిస్టర్డ్ సంఘాలతో కూడా సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 120 ఆర్థికపరమైన, 105 ఆర్థికేతర ఉద్యోగ సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ఈ సమస్యలపై చర్చించడానికి ఉద్యోగ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు 11వ పే రివిజన్ కమిషన్ వర్తింపు, కరువు భత్యం, మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్స్, పిఎఫ్ లోన్లు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, అమరావతి సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయడం తదితర ఆర్థికపరమైన డిమాండ్లు సాధించడంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు విఫలం అయ్యాయని విమర్శించారు. గతంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు ఉద్యోగుల సమస్యలపై స్పందించకుండా ప్రభుత్వానికి భజన సంఘాలుగా వ్యవహరించడం జరిగిందని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కావాలంటే గుర్తింపు పొందిన సంఘాలు మరియు రిజిస్టర్ సంఘాలతో చర్చలు జరపాలని నల్లపల్లి విజయ భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు పొందిన సంఘాలనే కాకుండా రిజిస్టర్డ్ సంఘాలతో చర్చించడం వల్ల చాలా సమస్యలు పరిష్కారం అయ్యాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగుల సమస్యలు నెరవేరుతాయనే నమ్మకం తో ఉన్నారని, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## స్త్రీ శక్తి పథకం విజయవంతం కోసం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక సదుపాయాలు

- హర్షం వ్యక్తం చేసిన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీ శక్తి పథకం విజయవంతం కోసం ఆర్టీసీ అధికారులు తీసుకున్న నిర్ణయాలను ఉద్యోగ సంఘం హర్షించింది. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే ప్రతిష్ఠాత్మక పథకం అమలులో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరగనుందని దృష్టిలో పెట్టుకుని మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ద్వారక తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) అందవరపు అప్పలరాజు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఆర్టీసీ ఇ.యు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ డ్యూటీలు చేసే కండక్టర్ల భత్యం రూ.700 నుంచి రూ.900కి, డ్రైవర్ల భత్యం రూ.800 నుంచి రూ.1000కు పెంచడంతో పాటు ఆన్‌కాల్ డ్రైవర్లకూ వర్తించేలా ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. స్త్రీ శక్తి పథకం ద్వారా వచ్చిన ఆదాయానికి అనుగుణంగా కండక్టర్లు, డ్రైవర్లకు ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని, అదనపు కిలోమీటర్లు తిరిగితే కిలోమీటరుకు రూ.3 చొప్పున వెంటనే చెల్లించాలని నిర్ణయించటం ఉద్యోగులకు ఊరటనిచ్చిందని వివరించారు. మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం గుర్తింపు కార్డుల జిరాక్స్, డిజిటల్ కాపీలను అనుమతిస్తూ, ఒరిజినల్ ఐడీ తీసుకురావాలని ప్రయాణికులకు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారని తెలిపారు. ఆగస్టు 5న ఆర్టీసీ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘం సమర్పించిన 32 అంశాల లేఖలోని ప్రతిపాదనలకు మేనేజ్‌మెంట్ వెంటనే ఆమోదం తెలపడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే, పాత బస్సులతోనే పథకాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో యూనియన్ సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అయితే ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో తనిఖీ అధికారులు తరచూ కేసులు రాయడం, బస్సు ఫెయిల్యూర్లపై మెకానికల్ సిబ్బందికి శిక్షలు విధించడం, డీజిల్ పొదుపు పేరుతో డ్రైవర్లపై ఒత్తిడి తేవడం మానుకోవాలని మేనేజ్‌మెంట్‌ను విజ్ఞప్తి చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467